ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.137	210	235
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 19.0

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం

ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గుర్తింపు

కోళ్లు దిగుమతి కాకుండా రాష్ట్ర సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టులు



నల్లగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో కొద్ది రోజుల క్రితం కోళ్ల మృత్యువాత పడగా, అందుకు బర్డ్‌ఫ్లూ కారణం కాదని రాష్ట్ర పశుసంవర్ధకశాఖతో పాటు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాతో పాటు ఉభయ గోదావరి, పలు జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బర్డ్‌ఫ్లూతో ఏపీలో కోళ్లు మృతిచెందాయని తెలిసిన వెంటనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు కోదాడ, వాడపల్లి, నాగార్జునసాగర్‌లో మూడు చెక్‌పోస్టులను అధికారులు ఏర్పాటు చేశారు. ఏపీ నుంచి కోళ్లు సరఫరా చేసే వాహనాలను ఈ చెక్‌పోస్టుల వద్ద నిలిపి ఆ రాష్ట్రానికి తిప్పి పంపిస్తున్నారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ ముంచుకొస్తుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు కోళ్ల ఫాములను ముమ్మరంగా తనిఖీచేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో కోళ్లు మృతిచెందినట్టు అధికారికంగా ప్రకటన లేదు. యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా కోళ్ల ఫాములు ఉండగా నల్లగొండ ఆ తరువాత స్థానంలో ఉంది. సుమారు 80లక్షల కోళ్లు ఉమ్మడి జిల్లా పరిధిలో పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో మూడు నెలల పాటు కోడి మాంసంతో పాటు కోడి గుడ్లను తినకుండా ఉండాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా బర్డ్‌ఫ్లూ లక్షణాలు కన్పిస్తే కోళ్ల దుకాణాలను మూసివేసేందుకు నిర్ణయం తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి.

చెక్‌పోస్టుల వద్ద అధికారులు

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి రాష్ట్ర సరిహద్దు వద్ద పోలీసులు, పశువైద్యశాఖ అధికారులు సంయుక్తంగా చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు. ఏపీ నుంచి రాష్ట్రంలోకి కోళ్లు తరలించకుండా అధికారులు ఇక్కడ నిఘా ఏర్పాటుచేశారు. ఇక్కడికి వచ్చే వాహనాల్లోని కోళ్లను తనిఖీచేసి వ్యాధి లక్షణాలు ఉన్న కోళ్లను వెనక్కి పంపుతున్నారు. ఇప్పటివరకు వ్యాధిసోకిన కోళ్లు రాలేదని సంబంధిత అధికారులు తెలిపారు.

పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు

మరో నాలుగు రోజులే

» పొడిగింపా లేక ప్రత్యేక అధికారులా? » సీఎం వద్ద సహకార సంఘాల ఫైల్

నల్లగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాల గడువు ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. అయితే పాలకవర్గాల గడువు మరికొంత కాలం పొడిగిస్తారా? లేక ప్రత్యేక అధికారులను నియమిస్తారా? అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలతో పాటు మునిసిపల్ పాలకవర్గాల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో పాలకవర్గాల గడువు పొడిగించకపోతే బ్యాంకుల అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. నెలలపాటు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగితే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలు రైతులకు దూరమవుతాయి.

అయితే పాలకవర్గాల గడువు పొడిగించాలని రాష్ట్రంలోని అన్ని డీసీసీబీల చైర్మన్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. పీఏసీఎస్‌ల గడువు 15వ తేదీతో ముగుస్తుండగా, డీసీసీబీ పాలకవర్గం గడువు ఈనెల 24తో ముగియనుంది. పీఏసీఎస్‌ల గడువు పొడిగించకపోతే డీసీసీబీ పాలకవర్గానికి కూడా ఎలాంటి బాధ్యతలు ఉండవు. పీఏసీఎస్‌ల గడువు పొడిగించకుంటే డీసీసీబీ పాలకవర్గాల బాధ్యతలు కూడా ముగిసిపోతాయి. ప్రస్తుతం గడువు పెంపు ఫైల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నట్టు సమాచారం. ఈనెల 13న లేదా 14న సహకార సంఘాల గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందో పీఏసీఎస్‌ల పాలకవర్గాలతోపాటు డీసీసీబీ పాలకవర్గం ఎదురుచూస్తోంది.

అప్పు చేసి పప్పు కూడు

ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అందని బిల్లులు



భోజనం చేస్తున్న విద్యార్థులు

కోదాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యను దగ్గర చేయాలనే తలంపుతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తోంది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఏజెన్సీలను నియమించింది. అందుకు అవసరమైన బియ్యం మినహా ఇతర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసినందుకు ఏజెన్సీలకు ప్రభుత్వం నెలనెలా బిల్లులు చెల్లించాలి. కాగా, 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రతీ నెల బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుండగా, హైస్కూల్ పరిధిలో ఉండే 9, 10వ తరగతి విద్యార్థులకు చెందిన బిల్లులు మాత్రం ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఏజెన్సీల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 580 ఏజెన్సీలు ఉన్నాయి. హైస్కూల్ విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.10.67 చెల్లిస్తోంది. కాగా, 9, 10వ తరగతి విద్యార్థుల చెందిన బిల్లులు గత ఏడాది సెప్టెంబరు నుంచి ప్రభుత్వం బకాయి పడింది. ఈ మొత్తం సుమారు రూ.3,64,91,000 వరకు ఉంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బిల్లులు రాకపోవడం, ఐదు నెలలుగా గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అప్పు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 580 ఏజెన్సీలు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 580 వరకు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 34,200మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈపాఠశాలల్లో 580మధ్యాహ్న వంట ఏజెన్సీలు ఉన్నాయి. 9,10వతరగతి విద్యార్థులకు ప్రభుత్వం రోజుకు రూ.10.67 చొప్పున చెల్లించాలి. ఈలెక్కన నెలకు సుమారు రూ.73లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఐదు నెలలుగా బిల్లులు రాకపోవడంతో బకాయి రూ.3.65కోట్లకు చేరింది.

అప్పుచేసి సరుకులు తెస్తున్నాం

బిల్లులు రాకపోవడంతో ప్రతీ రోజు ఇబ్బందులు పడి సరుకులు కొనుగోలు చేసి తెస్తున్నాం. తెలిసిన వారి వద్ద వడ్డీకి డబ్బు తెచ్చి సరుకులు కొనుగోలుచేస్తున్నాం. అటు కూలి గిట్టుబాటుగాక, ఇటు వడ్డీ పెరిగి ఆర్థిక భారం పడుతోంది. అధికారులను అడిగితే పైనుంచి రానిదే తామేం చేయలేమంటున్నారు. కిరాణా దుకాణంలో ఇప్పటికే రూ.50వేలు బాకీ దాటింది. పాతబాకీ చెల్లిస్తేనే సరుకులు ఇస్తామంటున్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి. అదే విధంగా గౌరవ వేతనం ఐదు నెలలుగా రావడం లేదు. వెంటనే బిల్లులతోపాటు గౌరవ వేతనం కూడా చెల్లించాలి.

\- శివరాత్రి సుజాత, నిర్వాహకురాలు



కడుపు కోత



» సాధారణ ప్రసవాలను మరిచిన ప్రైవేట్ వైద్యులు » శస్త్రచికిత్సకే మొగ్గు
» కొందరు సుముహుర్తాల పేరుతో ప్రసవాలు » సొమ్ముచేసుకుంటున్న వైద్యులు

ధనార్జనే ధ్యేయంగా కొంత మంది వైద్యులు సాధారణ ప్రసవాలు చేయడంలేదు. ఆస్పత్రికి వచ్చిన వారి నుంచి డబ్బు వసూలు చేసి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ శస్త్ర చికిత్సల ద్వారా భవిష్యత్‌లో మహిళలకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. అయినా గర్భిణులు చేసేది లేక వైద్యుల మాటలు విని శస్త్ర చికిత్స చేయించుకుంటున్నారు. కొంత మంది గర్భిణులు ప్రసూతి నొప్పులు భరించలేక శస్త్రచికిత్స చేయించుకుంటుండగా, మరికొందరు సుముహుర్తం పేరుతో శస్త్రచికిత్సకు మొగ్గు చూపుతున్నారు. దీంతో సాధారణ ప్రసూతులకంటే శస్త్రచికిత్సలు రెట్టింపు సంఖ్యలో జరుగుతున్నాయి.

\- ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్), నల్లగొండ

సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో కొంత మంది వైద్యులు డబ్బు ఆశతో గర్భిణులకు కడుపు కోత మిగులుస్తున్నారు. ఒక్కో శస్త్రచికిత్సకు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు. సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉన్నా ఏదో ఒక సాకు చెబుతూ శస్త్రచికిత్స చేస్తున్నారు. సాధారణ ప్రసూతికి వైద్యులు యత్నించడం మానేశారు.

నాలుగు రెట్లు పెరిగిన శస్త్ర చికిత్సలు

సూర్యాపేట జిల్లా పరిధిలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వరకు 9,141 ప్రసవాలు జరిగాయి. అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 4,123 ప్రసవాలు జరిగాయి. అందులో సాధారణ ప్రసవాలు 2,410 వరకు, శస్త్రచికిత్సలు 1,713 వరకు ఉన్నాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో 5,018 ప్రసవాలు జరగ్గా, అందులో 921 సాధారణ ప్రసవాలు, 4,097 శస్త్ర చికిత్సలు ఉన్నాయి. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో సుమారు నాలుగు రెట్లు శస్త్రచికిత్సలు జరిగాయి. నల్లగొండ జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు మొత్తం 21,906 ప్రసవాలు జరిగాయి. అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11,732 ప్రసవాలు జరగ్గా, వీటిలో సాధారణ ప్రసవాలు 5,630 ఉన్నాయి. శస్త్రచికిత్సలు 6,102 జరిగాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మొత్తం 10,174 ప్రసవాలు జరగ్గా అందులో 1,892 సాధారణ ప్రసవాలు, 8,281 శస్త్రచికిత్సలు ఉన్నాయి. జిల్లాలో సుమారు నాలుగురెట్లు అధికంగా శస్త్రచికిత్సలు జరిగాయి.

ఆపరేషన్లకు మొగ్గు చూపుతున్న కొందరు

గర్భం దాల్చిన మహిళలు కొంత మంది ఆపరేషన్ల ద్వారా డెలివరీ అయ్యేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రసూతి సమయంలో సాధారణ డెలివరీ అవ్వాలంటే నొప్పులు భరించాల్సి వస్తుంది. అయితే ప్రస్తుత సమాజంలో కొంత మంది మహిళలు నొప్పులు భరించలేక ఆపరేషన్ ద్వారా డెలివరీ అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా సాధారణ పద్ధతిలో ప్రసూతి చేసేందుకు వైద్యులు సైతం ప్రయత్నాలు చేయడం లేదు. సాధారణ ప్రసూతి సమయంలో కొన్ని సందర్భాల్లో కొంత మంది గర్భిణులు మృతి చెందుతున్నారు. అలాంటి సందర్భాల్లో మృతురాలి బంధువులు ఆసుపత్రుల వద్ద ఘర్షణలకు పాల్పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కూడా వైద్యులు ఆపరేషన్ చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఆపరేషన్ ద్వారా డెలివరీ చేయడం వైద్యులకు సులభతరం. అంతేగాక సాధారణ ప్రసూతి కంటే అధిక మొత్తం డబ్బు వస్తుండటం కూడా కారణం.

సుముహుర్తాల కోసం..

గర్భం దాల్చిన మహిళలు ప్రసూతి అయ్యే సమయాన్ని ముందుగానే స్కానింగ్ రిపోర్ట్ ద్వారా తెలుసుకుంటున్నారు. దీంతో పాటుప్రసూతి అయ్యే సమయంలో..

- మిగతా 8వ పేజీలో..

అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తే చర్యలు

ప్రసూతి కోసం వచ్చే గర్భిణులకు అవసరం లేకున్నా ఆపరేషన్లు చేసే వైద్యులపై చర్యలు తీసుకుంటాం. సాధారణ ప్రసవం చేసేందుకు వైద్యులు ప్రయత్నించాలి. అధికంగా ఆపరేషన్ల ద్వారా కాన్పులు చేసే ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. మహిళల ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్లు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధికశాతం సాధారణ ప్రసూతికే ప్రాధాన్యం ఇస్తున్నాం. మహిళలు కూడా సాధారణ ప్రసూతికి చొరవ చూపాలి.

\- డాక్టర్ కోటా చలం, డీఎంహెచ్‌వో, సూర్యాపేట

నిబంధనల మేరకు ఓట్లు లెక్కించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న అహ్మద్ నదీం

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నామినేషన్ల పరిశీలన అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టే ఆర్జాలబావి వద్ద గోదామును కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్‌లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్టేజ్-1, 2 అధికారుల శిక్షణలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడారు. మొత్తం 66 మందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహ నిర్మాణశాఖ పీడీ రాజకుమార్, మాస్టర్ ట్రైనర్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

(ఆంధ్రజ్యోతి, చండూరు రూరల్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడంగిపర్తి మహాత్మా జోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, తరగతి గదులు, వంటలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాను ఎంత కష్టపడి చదివి ఈ స్థాయిలో చేరారో వారికి వివరించారు. విద్యార్థులు సైతం తనలా ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి కష్టపడి చదవాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఆర్డీవో శ్రీదేవి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, తహసీల్దార్ దశరథ, మునిసిపల్ మేనేజర్ అరుణ, పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి, చండూరు): చండూరు ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వైద్య సేవలు పొందుతున్న రోగుల రికార్డులను పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిశాక సంబంధిత అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని పోస్టులు భర్తీ చేస్తామన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పట్టణంలో మరో చోటికి తరలించేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన భవన నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద జిల్లా సరిహద్దును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చిత్రంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ కొండల్‌రెడ్డి

శాలిగౌరారం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినా, డంప్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని వంగమర్తి ఇసుక రీచ్‌లను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, డంపింగ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో చెక్ పోస్టులు, నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలిస్తే డయల్ 100గానీ, సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. ఆయన వెంట డీఎస్పీ కొలను శివరాం రెడ్డి, సీఐ కె.కొండల్‌రెడ్డి, ఎస్ఐ డి.సైదులు, తదితరులు ఉన్నారు.

కానిస్టేబుళ్లకు రివార్డు

(ఆంధ్రజ్యోతి, కనగల్): కనగల్ పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుళుగా పనిచేస్తున్న పి.శేఖర్, వై.నగేష్‌కు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం నల్లగొండలో రివార్డులు అందజేశారు. మండలంలోని చినమాదారం జంటహత్య కేసులు, పర్వతగిరి కల్లు గుడిసెలో మహిళ దారుణ హత్య కేసులో సరైన ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడేలా చేశారని ఎస్పీ ఈ సందర్భంగా ప్రశంసించారు. అదేవిధంగా హర్యానాలో మార్చి 6 నుంచి జరిగే జాతీయ పోలీస్ క్రీడలకు ఎంపికైన కానిస్టేబుల్ బేబీశాలినికి నగదు బహుమతిని అందజేశారు.

‘ఉపాధి’ పనులు కల్పించడంలో నిర్లక్ష్యం తగదు

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



మహమ్మదాపురంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

నాంపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు పని కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మహ్మదాపురం గ్రామంలోని నర్సరీ మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ గ్రామంలో 50మంది కూలీలకు తప్పకుండా పని కల్పించాలన్నారు. ఇప్పటి వరకు మహమ్మదాపురం గ్రామంలో పనులు ప్రారంభం కాలేదని శుక్రవారం వరకు కూలీలకు పని కల్పించాలని, లేదంటే సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈనెల చివరి నాటికి స్థానికంగా దొరికే విత్తనాలతో నర్సరీలో మొక్కలు పెంచాలన్నారు. ప్రభుత్వం తోటల పెంపకానికి వందశాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశం, సిబ్బంది లింగయ్య, అంజయ్య, ఈశ్వరయ్య, భాస్కర్, నాగయ్య, అజయ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పదిలో వంద శాతం

ఉత్తీర్ణత సాధించాలి

విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి



మధ్యాహ్న భోజన వంటను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. మండలంలోని అక్కెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్)పై కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎఫ్‌పీని ఉపాధ్యాయులు సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. ప్రతీ తరగతి గదిలో ఐఎఫ్‌పీపై బోధన చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. మెనూ పాటించాలని, ఆహారాన్ని నాణ్యతగా తయారు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఉపాధ్యాయులు కూడా ప్రతీ రోజు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని ఆదేశించారు. డీఈవో వెంట పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటేశ్, రిసోర్స్ పర్సన్స్ సతీశ్‌కుమార్, సుజాత ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలో జరిగిన సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందన్నారు. పార్టీ శ్రేణులు అన్ని గ్రామాల్లో కొత్త శాఖల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీచేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. డిండి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదిస్తు అసెంబ్లీ ఆమోదాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఉప్పునూతల వెంకటయ్య, బొడ్డుపల్లి వెంకటరమణ, బుచ్చిరెడ్డి, మైనుద్దీన్, వెంకటయ్య, జయరాములు, పాండురంగారెడ్డి, నూనె రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



జౌళిశాఖ ఏడీ ద్వారక్

గట్టుప్పల్‌లో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న ఏడీ ద్వారక్

గట్టుప్పల్,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):చేనేత కార్మికులకు అభయహస్తం, నేతన్న పొదుపు పథకాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జౌళిశాఖ ఏడీద్వారక్ అన్నారు.స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు పథకానికి వివర్ రూ.1,200, అనుబంధ కార్మికులు రూ.600 చెల్లించాలన్నారు. ఈ పథకానికి ప్రీమియంను 36 నెలల నుంచి 24నెలలకు ప్రభుత్వం కుదింపు చేసిందన్నారు. జియోట్యాగ్ ఉన్న ప్రతీ చేనేత కార్మికుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జౌళిశాఖ ఏడీవో గోపాల్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సంతకం చేయని అభ్యర్థి.. నామినేషన్ తిరస్కరణ

● సక్రమంగా 22 నామినేషన్లు ● 13వ తేదీన ఉపసంహరణకు గడువు



వివరాలు వెల్లడిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలాత్రిపాఠి, ఎన్నికల సాధారణ పరిశీలకులు అహ్మద్‌నదీమ్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు దాఖలైన నామినేషన్లలో ఒక నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. ఈ నెల 3నుంచి 10వ తేదీవరకు స్వీకరించిన నామినేషన్లను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకులు, రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్‌నదీమ్ సమక్షంలో జిల్లా కలెక్టర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలాత్రిపాఠి ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. మొత్తం 23నామినేషన్లు రాగా, ఇండిపెండెంట్ అభ్యర్థి తుండు ఉపేందర్ నామినేషన్ పత్రాలపై సంతకం లేని కారణంగా నామినేషన్‌ను తిరస్కరించారు. 22 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నెల 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువుకాగా, ఎంతమంది బరిలో ఉన్నారనేది తేలనుంది. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నేరేడుగొమ్ము, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): విద్యుదాఘాతంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామశివారులో సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దమునిగల్ గ్రామానికి చెందిన రైతు కేతావత్ చెన్న పొలానికి సమీపంలో అడవి పందుల రక్షణ కోసం ఏర్పాటు చేసి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందాడు. మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవాడై ఉంటాడని, చేపల వేటకోసం లేదా కూలి పనుల కోసం ఈ ప్రాంతానికి వచ్చి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని, స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

64 ఇసుక డంపులు సీజ్

మద్దిరాల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 64 ఇసుక డంపులను తహసీల్దార్ అమీన్‌సింగ్ మంగళవారం సీజ్ చేశారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల పరిధిలోని పీర్యానాయక్‌తండాకు చెందిన భూక్య వీరన్న, భూక్య శంకర్, భూక్య సీతారాములు పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను నిల్వ చేశారు. ట్రాక్టర్ల యజమానులు రిజిస్ట్రేషన్ కాగితాలు ఉండాలని, లేకుంటే ఆర్డీవోకు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 9 గొర్రెలు మృత్యువాత

మోటకొండూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో తొమ్మిది గొర్రెలు మృతిచెందాయి. మరో ఏడు గొర్రెలు గాయపడ్డాయి. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని అమ్మనబోలు గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితుడు తొట్టె మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెలను సాయంత్రం వరకు మేపుకొచ్చి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన కొట్టం మందలో వదిలి ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి సమయంలో కొన్ని వీధి కుక్కలు మందలోకి చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. మంగళవారం తెల్లవారుజామున గొర్రెల మంద వద్దకు వచ్చి చూడగా వీధి కుక్కల దాడిలో తొమ్మిది గొర్రెలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. మృత్యువాత పడిన గొర్రెల విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

సహకార సంఘంలో రూ.65లక్షలు స్వాహా

మర్రిగూడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడ రైతు సేవ సహకార సంఘం ఉద్యోగులు డబ్బులు స్వాహా చేశారు. సొసైటీలో పనిచేసే ముగ్గురు ఉద్యోగులు గుట్టు చప్పుడు కాకుండా రూ.65లక్షల50వేలు వాడుకున్నారు. 2020 ఫిబ్రవరి నుంచి 2024 డిసెంబరు మధ్యకాలంలో పలు దఫాలుగా ఒక్కరు రూ.40లక్షలు, ఇంకొకరు రూ.13 లక్షలు, మరొకరు రూ.12.50లక్షలు డ్రాచేసి వారి సొంత అవసరాలకు వాడుకున్నారు. ఈ విషయమై పాలకవర్గం చైర్మన్ బాల నర్సింహ మూడు నెలల క్రితం జిల్లా డీసీవోకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగులు అక్రమాలకు పాల్పడి నట్లు విచారణలో తేలింది. పాలకవర్గం హడాహుడిగా సొసైటీలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసింది. పాలకవర్గానికి తెలియకుండా ముగ్గురు ఉద్యోగులు రూ.65లక్షల అక్రమాలకు పాల్పడ్డారని, వీరి నుంచి డబ్బులు రికవరీ చేసి సొసైటీలో నిల్వఉండే విధంగా చూడాలని చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం ముగ్గురు ఉద్యోగులు పాలకవర్గం విచారించగా వారు ఒప్పుకొని ఒకరు రూ.19లక్షలు, మరొకరు రూ.12లక్షలు, ఇంకొకరు రూ.7లక్షలు చెల్లించినట్లు చైర్మన్ బాల నర్సింహ తెలిపారు. మిగిలిన డబ్బులు సొసైటీలో విడతల వారీగా జమ చేస్తామని ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్ష

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతనం కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని గత సంవత్సరం అక్టోబరులో కిరాణ దుకాణం ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన చెందిన కొప్పు నగేష్ దొంగలించాడు. బైక్ యజమాని సన్నగళ్ల మల్లేష్ కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కొప్పు నగేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని మంగళవారం దేవరకొండ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కేవీఎస్ హరీష్ బాబు ఎదుట హాజరుపరిచారు. దొంగతనం చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.


పశువుల దొంగల అరెస్టు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): పశువులను ఎత్తుకెళ్తున్న దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదయ్య తన రెండు ఆవులను జనవరి 22వ తేదీన వ్యవసాయ కొట్టంలో కట్టివేశాడు. అదేరోజు రాత్రి దొంగలు వాహనంలో వచ్చి ఆవులను దొంగలించారని కొండమల్లేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నేరస్థులను గుర్తించి కొండమల్లేపల్లి చౌరస్తాలో మంగళవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ఆవులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. డిండి, దేవరకొండ, యాచారం, కొండమల్లేపల్లి ప్రాంతాల్లో పశువులను దొంగలించినట్లు నేరస్థులు ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతచెట్టుతండా గ్రామ పరిధిలో గల జేత్యతండా నుంచి మంగళవారం తెల్లవారుజామున బొల్లెరో వాహనంలో 10 గోవులను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కొండమల్లేపల్లి చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేసి పట్టుకున్నారు. బొల్లెరో వాహనాన్ని కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, పది గోవులను వెల్దండ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

ఆవేదన కలిగించొద్దు ఆదరిద్దాం



- తల్లిదండ్రులను పట్టించుకోని వైనం
- బాధ్యత నుంచి తప్పుకుంటున్న వారసులు
- చేసేది లేక ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తున్న వృద్ధులు
- మలి సంధ్యలో అండగా చట్టాలు

పండుటాకులు కృంగి పోతున్నాయి. కని పెంచి పెద్ద చేసి ప్రయోజకులుగా తయారు చేసిన తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో కుమారు లు అక్కున చేర్చుకోలేకపోతున్నారు. తన ఎదుగుదలకు కష్టపడి జీవితాన్ని ధారపోసిన కన్న వారి కోసం కనీస బాధ్యతలను మరిచి సంస్కృతి, సాంప్రదాయాలు కలిగిన దేశంలో కుటుంబ పరిరక్షణకై ఎన్ని చట్టాలు వచ్చినా అమలుకు నోచుకోక వృద్ధాప్యంలో ఆదరణ కోల్పోయి అనాథలవుతున్నారు. జీవిత చరమాంకంలో అండగా ఉంటారనుకున్న వారసులే బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. తమను పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట(కలెక్టరేట్)

పిల్లల పోషణ, ఎదుగుదలపై తల్లిదండ్రులు చూపిన శ్రద్ధ వృద్ధాప్యంలో పిల్లలు కనీస ప్రేమ చూపడంలేదు. కడుపున పుట్టిన పిల్లలు ప్రయోజకులైతే చాలనుకుని విశ్రాంతి తీసుకునే వయస్సులో కడుపున పుట్టిన వారి ఆదరణ లేక వృద్ధాప్యంలో శారీరక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తన పోషణకు సహకరించని తనయులపై చర్యలకు చట్టాలు ఉన్నప్పటికీ పేగు బంధం అడ్డువస్తోంది. వృద్ధుల కోసం ప్రస్తుతం చట్టాలతో పాటు జిల్లా, డివిజన్ స్థాయి రెవెన్యూ యంత్రాంగం అండగా ఉంటుంది. వృద్ధాప్యంలో తమ ఆలన, పాలన చూడని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకునేందుకు చట్టాలు వెలుగులోకి వచ్చాయి.

వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం

కన్న బిడ్డల నుంచి తల్లిదండ్రులను కాపాడేందుకు 2007లో కేంద్ర ప్రభుత్వం వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఆగడాలు చెప్పుకోలేక కొందరు తల్లిదండ్రులు కష్టాలను కడుపులో దాచుకుంటూ అనాథ శరణాలయాలకు చేరుకుంటున్నారు. అలాంటి వారు అనాథలుగా బతకాల్సిన అవసరం ఏ మాత్రం లేదని చట్టం చెబుతోంది. కన్న బిడ్డలు నమ్మిన బంధువులు తమను నిరాదరణకు గురి చేస్తే అలాంటి సమయాల్లో వృద్ధుల జీవనానికి కావాల్సిన పోషణకు వారి నుంచే వసూలు చేసుకునే హక్కు ఈ చట్టం కల్పిస్తోంది.

వృద్ధాప్యానికి అండగా ట్రిబ్యునల్

కని పెంచిన పిల్లల నుంచి నిరాదరణకు గురైన వృద్ధులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. నిస్సహాయులైన పండుటాకులు తమ పిల్లల, మనవళ్ల, మనవరాళ్ల, బంధువుల నుంచి జీవన భృతి కోరుతూ ట్రిబ్యునల్‌కు కేసులు దాఖలు చేయవచ్చు. జీవనభృతితో పాటు రక్షణ పొందే హక్కు వారికి ఉంటుంది. వారు నేరుగా పిటిషన్ దాఖలు చేయవచ్చు. కొన్ని సందార్భాల్లో ట్రిబ్యునల్ ఇలాంటి కేసులను సుమోటోగా స్వీకరించవచ్చు. వృద్ధుల నుంచి పిటిషన్ దాఖలైన తర్వాత బాధ్యులకు నోటీసులు జారీ చేస్తుంది. నోటీసులు అందిన 90 రోజుల్లో కేసులను పరిష్కరిస్తారు. తగిన కారణాలు ఉంటే మరో 30 రోజులు గడువు ఇస్తారు. నెలకు గరిష్ఠంగా రూ.10వేల వరకు జీవనభృతి చెల్లించకపోతే 5శాతం నుంచి 18శాతం వడ్డీతో ఈ మొత్తాన్ని వృద్ధులకు వసూలు చేసి ఇస్తారు. జీవనభృతి చెల్లించని పక్షంలో మూడు నెలల పాటు జైలు శిక్షతో పాటు ఐదు వేల జరిమానా విధిస్తారు. వృద్ధులకు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన తర్వాత బాధ్యులు ఉద్దేశపూర్వకంగా ట్రిబ్యునల్ ఎదుట హాజరుకాకపోయినా వృద్ధులకు అనుకూలంగా ఏకపక్ష తీర్పు ఇస్తారు.



అందరు ఉన్నా అనాథలుగా..



అందరూ ఉండి అనాథలుగా చరమాంకంలో వృద్ధాశ్రమంలో గడపాల్సి వస్తోంది. బాగా బతికిన వారు కుమారులు, కుమార్తెలు ఉండి కూడా వారిని చూసుకునే పరిస్థితి లేక వారే స్వయంగా అనాథశ్రమంలోకి వెళ్తున్నారు. ఆశ్రమానికి నెలకు కొంత ఖర్చులు చెల్లించడం దయనీయంగా మారింది. స్వచ్ఛంద సంస్థలు ప్రవాసభారతీయులు సేవాభావంతో ఉచితంగా ఆశ్రమాలు నిర్వహిస్తుంటే కొన్ని వృద్ధాశ్రమాలు నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలు వసూలు చేస్తున్నాయి. కన్నతల్లిదండ్రులను చివరి దశలోవారి కళ్ల ఎదుట జీవించే విధంగా వారికి సపర్యలు చేయాల్సిన అవసరం ఉంది.

సూర్యాపేట జిల్లాలో 116 దరఖాస్తులు

సూర్యాపేట జిల్లాలో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు సుమారు లక్ష మంది వరకు ఉన్నారు. తమను కుమారులు, కుమార్తెలు పోషించడం లేదని తెలుపుతూ ఏడాదిలో 116 మంది వృద్ధులు దరఖాస్తు చేసుకున్నారు. సూర్యాపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో 62 మంది, కోదాడ పరిధిలో 21 మంది, హుజూర్‌నగర్ పరిధిలో 33 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తులు స్వీకరించిన ఆర్డీవోలు దరఖాస్తుదారుల కుమారులు, కుమార్తెలను పిలిపించి వారితో మాట్లాడి తల్లిదండ్రులను పోషించే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో జిల్లాలో 87 మంది దరఖాస్తులను పరిష్కరించగా ఇంకా 29 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

తల్లిదండ్రులను పోషించకపోతే చర్యలు



వృద్ధులైన తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత వారి కుమారులు, కుమార్తెలపై ఉంది. ఎవరైనా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పోషించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యతను విస్మరిస్తే జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తారు. కని పెంచి ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులను మరువద్దు.

- నర్సింహ్మరావు, జిల్లా సంక్షేమాధికారి సూర్యాపేట.

చట్టాలు పక్కాగా అమలు చేయాలి



వయో వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను పక్కాగా అమలు చేయాలి. సమాజంలో కొందరు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. దీంతో అలాంటి వారు నిరాదరణకు గురవుతున్నారు. జిల్లా కేంద్రంలో వయో వృద్ధుల కోసం ప్రభుత్వం వృద్ధాశ్రమాన్ని నిర్మించాలి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగా ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు బస్సు ఛార్జీల్లో రాయితీలు అమలు చేయాలి.

- బొల్లు రాంబాబు, వయో వృద్ధుల సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు.

సీఐని బెదిరించిన కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

నల్లగొండ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): క్రైమ్ మిర్రర్ డిజిటల్ పేపర్ ముసుగులో వసూళ్లకు పాల్పడిన ప్రధాన నిందితుడు ఆనంద్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు కేసు వివరాలు వెల్లడించారు. నాగుల ఆనంద్‌కుమార్ అలియాస్ ఆనంద్ క్రైమ్ మిర్రర్ ఈ - న్యూస్ పేపర్- స్టేట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోగా చలామణి అవుతున్నాడు. ప్రభుత్వ అధికారులపై తప్పుడు, అబద్ధపు వార్తలు ప్రచురిస్తూ వారిని బెదిరింపులకు గురిచేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఈ కేసులో తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులు అలియాస్ అంజిని ఈ నెల 2న తేదీన మిర్యాలగూడ పోలీసులు అరెస్టు చేశారు. నాగుల ఆనంద్‌కుమార్ తనకు పరిచయమైన తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులు అలియాస్ అంజి సహకారంతో ఒక ముఠాగా ఏర్పడ్డారు. నల్లగొండ జిల్లా, వికారాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాలో కూడా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులను లక్ష్యంగా చేసుకొని, అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తప్పుడు, కల్పిత సమాచారంతో క్రైమ్ మిర్రర్ డిజిటల్ పత్రికలో ప్రచురించే వారని డీఎస్పీ తెలిపారు. గతంలో నల్లగొండ జిల్లా హెడ్‌క్వార్టర్ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీస్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన కొంపల్లి మత్స్యగిరి, పారా మెడికల్ యూనియన్‌లో వారి డిపార్ట్మెంట్ సమస్యల పరిష్కారానికి చురుకుగా పనిచేస్తున్నాడని, అతనిని తమ లక్ష్యంగా ఎంచుకొని 27జూలై 2024న డీఎంహెచ్‌వో ఆఫీసు సిబ్బంది పైన పరోక్షంగా మత్స్యగిరి పైనా అక్రమాలకు పాల్పడుతున్నట్లు అర్థం వచ్చే విధంగా 'ప్రభుత్వ ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు కుచ్చు టోపీ' అనే శీర్షికతో క్రైమ్ మిర్రర్ పేపర్‌లో ప్రచురించి, సోషల్ మీడియాలో కూడా వైరల్ చేశారు. తర్వాత సదరు మత్స్యగిరిని వాట్సాప్ కాల్స్ ద్వారా అతనిని సంప్రదించి, రూ. 4లక్షలు ఇవ్వాలని, లేదంటే పేరు బహిర్గతం చేస్తామని, లేనిపక్షంలో క్రైమ్ మిర్రర్ డిజిటల్ పేపర్‌లో స్టోరీలు రాస్తామని, లేదంటే నీ అంతు చూస్తామని మని బెదిరించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. బాధితుడు భయపడి అక్టోబరు 1వ తేదీ 2024న రూ.50వేలు గూగుల్ పే ద్వారా పంపించాడు.

మళ్లీ బెదిరిస్తే మరో రూ.40వేలు ఇచ్చాడు. తనకు జరిగిన అన్యాయం గురించి ఫిబ్రవరి 2వ తేదీ 2025న బాధితుడు నల్లగొండ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి, సాక్ష్యాధారాలు సేకరించి, మంగళవారం ప్రధాన నిందితుడు నాగుల ఆనంద్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి, సెల్‌ఫోన్ స్వా ధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. మిగతా ఇద్దరు నేరస్థులు మిర్యాల గూడ రూరల్ సీఐ వీరబాబును కూడా ఇదే విధంగా వేధించి, భయపెట్టి రూ.2లక్షలు డిమాండ్ చేసిన కేసుకు సంబంధించి మిర్యాలగూడ టూ టౌన్‌లో నమోదైన కేసులో ఇటీవలే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. మిగితా బాధితులు కూడా ఇప్పుడు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేస్తున్నారని, విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని డీఎస్పీ తెలిపారు.

ఖననం చేసిన 20 రోజుల తర్వాత పోస్టుమార్టం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో 20రోజుల క్రితం మరణించిన పెడవంగ కనకమ్మ మృతదేహానికి అధికారుల సమక్షంలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక సిమెంట్ కంపెనీలో పనిచేస్తున్న పెడవంగ అమృతం భార్య కనకమ్మ కోదాడ బస్సు డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుండేవి. గత నెల 21వ తేదీన విధులు ముగిసిన అనంతరం తన ఇంట్లో మృతిచెందింది. బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందినట్లు భావించిన కుటుంబ సభ్యులు స్వగ్రామం నేరేడుచర్ల మండలం సర్వారం గ్రామంలో జనవరి 22వ తేదీన మృతదేహాన్ని ఖననం చేశారు. తల్లి మృతిపై తమకు అనుమానం ఉందని కనకమ్మ పెద్దకుమారుడు సందీప్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ జ్యోతి, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, సమక్షంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



మల్లమ్మ(ఫైల్)

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. సూర్యాపేట జిల్లా మండలం ఏనుబాముల గ్రామ శివారు సంతోష్‌మాత ఆలయం సమీపంలో సూర్యాపేట నుంచి నెమ్మికల్ వైపు వస్తున్న ఆటో అదుపు తప్పి చెట్టుకు ఢీకొని ఏనుబాముల గ్రామానికి చెందిన వర్రె మల్లమ్మ(70) మృతిచెందింది. బంధువుల దశదిశ కర్మకు వర్రె మల్లమ్మ, వర్రె పార్వతమ్మ కలిసి సూర్యాపేట మండలం ఆరెగూడేనికి వెళ్లారు. ఇంటికి తిరిగి వస్తూ సూర్యాపేట నుంచి తమ స్వగ్రామానికి వచ్చేందుకు నెమ్మికల్‌కు చెందిన మోరపాక వెంకన్న ఆటో ఎక్కారు. మరో రెండు నిమిషాల్లో ఏనుబాముల స్టేజీ వద్ద ఆటో దిగాల్సి ఉండగా ఆటో చెట్టుకు ఢీకొనడంతో వర్రె మల్లమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. వర్రె పార్వతమ్మ, డ్రైవర్ మోరపాక వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మల్లమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మల్లమ్మ కుమారుడు వర్రె రామన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కారు వెనుక నుంచి ఢీకొని...

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. సీఐ రమేష్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన ఎండీ. ఇస్లాం(27), ఇబ్రహిం సోహెల్ కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్నారు. వరంగల్- హైదరాబాద్ జాతీయ రహదారి మండలంలోని గోదుమకుంట హరిత వెంచర్ సమీపంలోకి చేరుకోగానే రేణికుంట శ్రీనివాస్ తన కారులో వరంగల్ వైపునకు అతి వేగంగా వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న ఎండీ. అస్లాం అక్కడికక్కడే మృతి చెందాడు. ఎండీ. ఇబ్రహిం సోహెల్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అస్లాం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని పద్మానగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై ఈ నెల 9న ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జెట్ల రాము(39) చికిత్సపొందుతూ సోమవారం రాత్రి గాంధీ ఆస్పత్రిలో మృతిచెందాడు. జెట్ల రాముకు భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. సంఘటనపై రాము బాబాయి జెట్ల దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు



ఎండీ. జబీన్(ఫైల్)

అడ్డగూడూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మృతిచెందింది. ఈ సంఘటన యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామ శివారులో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం దాచారం గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ. జబీన్(54) అడ్డగూడూరు మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యేందుకు మంగళవారం హైదరాబాద్ నుంచి స్కూటీపై వస్తుండగా మార్గమధ్యంలో చౌళ్లరామారం గ్రామ శివారులోకి రాగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో జబీన్ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. జబీన్ భర్త అంజద్‌అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. జబీన్‌కు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కోడ్ కూసినా ముసుగు పడలే..



మునుగోడులో తొలగించని రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు




ఆత్మకూర్(ఎం)లో ముసుగు వేయని రాజకీయ నాయకుల విగ్రహాలు

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి వారం దాటినా యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో కోడ్ అమలు కావడం లేదు. రాజకీయ పార్టీల కు చెందిన ఫ్లెక్సీలను సిబ్బంది తొలగించారు. కాని ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న బొమ్మగాని ధర్మభిక్షం, ఎన్టీఆర్, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, గుర్రం యాదగిరిరెడ్డిల విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేయలేదు. అదే విధంగా మునుగోడులో రాజకీయ పార్టీలు, నేతల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. నాయకుల విగ్రహాలకు సైతం పూర్తి స్థాయిలో ముసుగులు వేయలేదని పలువురు పేర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన అధికారులకు ఇవేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

● ఆత్మకూరు(ఎం), మునుగోడు, (ఆంధ్రజ్యోతి)

నేర చరిత నేతలపై శాశ్వత నిషేధం సరైనదే

నిజాయితీగా, స్వచ్ఛందంగా ఉండాల్సిన రాజకీయాలు నేరమయం అవుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ధన, కండ బలంతో చట్టసభలకు, స్థానిక సంస్థలకు ఎన్నికవుతున్న ఈ తరహా నేతల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు చట్టసభల్లో పోటీ చేయకుండా శాశ్వత నిషేధం విధించడంపై అభిప్రాయాన్ని తెలపాలంటూ సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించడంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత నిషేధం చట్టసభలతో పాటు స్థానిక సంస్థలకు కూడా వర్తింపజేస్తే మరింత స్వచ్ఛపాలన సాధ్యమవుతుందని అన్ని వర్గాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్

సుప్రీంకోర్టు నిర్ణయం శుభపరిణామం



నేరచరిత ఉన్న ప్రజాప్రతినిధులపై శాశ్వత నిషేధంపై సుప్రీంకోర్టు తీసుకుంటున్న నిర్ణయం హర్షనీయం. ఆదర్శంగా, నిజాయతీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా ఉంటున్నందున అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అవుతూ అవినీతి పెరిగిపోతోంది. వాస్తవానికి ఇలాంటి కఠిన నిర్ణయాన్ని ఈపాటికే తీసుకుని ఉంటే దేశం మరింత అభివృద్ధి సాధించేది.

● డాక్టర్ కె.రఘుపతిరెడ్డి, హోమియోవైద్యుడు, భువనగిరి


కుటుంబసభ్యుల పోటీపై కూడా నిషేధం విధించాలి



క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన వారితోపాటు వారి కుటుంబ సభ్యులపై కూడా ఎన్నికల్లో పోటీ చేయడంపై శాశ్వత నిషేధం విధించాలి. దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులు ఎన్నికపై నిషేధం విధించినా, వారి కుటుంబసభ్యుల లేదా అనుయాయులు పోటీ చేసి గెలుపొందితే.. నిషేధం ఆశించిన ఫలితాలను ఇవ్వదు. ఈ మేరకు సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ కఠిన నిర్ణయం తీసుకోవాలి. ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఇరికించిన కేసులపై సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ సరైన నిర్ణయం తీసుకోవాలి

● ఐ.కృష్ణ న్యాయవాది, భువనగిరి


అభివృద్ధి కుంటుపడటానికి వారే ప్రధాన కారణం



పలు ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం వెనుకబడటానికి ప్రధాన కారణం రాజకీయ నాయకుల్లో చిత్తశుద్ధి కొరవడమే. తమ స్వప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ దేశం, ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం ప్రజాప్రతినిధులు నేర చరితులుగా ఉండటమే. ఆ తరహా నేతలు పోటీ చేయడంపై శాశ్వత నిషేధం విధించాలనే ఆలోచన ఆలస్యంగానైనా రావడం శుభపరిణామం.

● జంపాల అంజయ్య, సామాజిక కార్యకర్త

స్వచ్ఛ పాలనకు అవకాశం



నేర చరిత నేతలు ఎన్నికల్లో పోటీ చేయడంపై శాశ్వత నిషేధం విధిస్తే స్వచ్ఛపాలనకు మార్గం సుగమమవుతుంది. అంతేకాక మిగతా ప్రజాప్రతినిధులు కూడా నేరాలకు దూరంగా ఉంటారు. చట్టసభలతోపాటు స్థానిక సంస్థలకు కూడా ఇదే విధానాన్ని అమలుచేస్తే మరింత మంచిది. సుప్రీంకోర్టు తీసుకున్న నూతన నిర్ణయం దేశ రాజకీయాలు, దేశ అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపనుంది.

● డి.పాపిరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, భువనగిరి

దేదీప్యమానంగా దివ్యవిమాన రథోత్సవం

- రాత్రి రథాంగ హోమం..రథాంగబలి
- ఉదయం గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట దేవస్థానం అనుబంధ ఆలయం పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టం లక్ష్మీనరసింహుల దివ్యవిమాన రథోత్సవం ఐదో రోజు మంగళవారం రాత్రి వైభవంగా సాగింది. అర్చకులు, రుత్వికులు, వేద పండితులు వేద మంత్ర పఠనాలు.. భక్తజనుల ఆధ్యాత్మిక నినాదాలు, యువకుల, చిన్నారుల కేరింతల మధ్య సన్నాయి, బ్యాండు మేళాల నడుమ మహాలక్ష్మీ సమేతుడై లక్ష్మీ నరసింహుడు దివ్యవిమాన రథంపై ఊరేగించారు. లోక కల్యాణం కోసం సోమవారం రాత్రి నిర్వహించిన తిరుకల్యాణ లక్ష్మీనరసింహులను రథాంగ దర్శనం చేసుకుని భక్తులు తరించారు. విశేష అలంకారంలో కల్యాణ లక్ష్మీనరసింహులు భక్త జనులకు రథంపై దర్శనమిచ్చారు. స్వామిఅమ్మవార్లను భక్తులు గోవింద నామస్మరణలతో పురవీధుల్లో ఊరేగించేందుకు పరవశిస్తూ రథ పగ్గాలు లాగారు.. పట్టు వస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలు, వజ్రవైఢూర్యాలతో తేజోమయమైన దివ్య విమాన రథ దర్శనం ముక్తి ప్రదాయమని భక్తుల విశ్వాసం. అంతకు ముందు స్వామి వారి రథానికి అర్చకులు వేదమంత్రాలతో పూజించారు. రథాంగ హోమం, దిష్టికుంభం నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవ పూజా కైంకర్యాలను ప్రధానార్చకుడు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు భట్టర్ సురేంద్రాచార్యులు, కొడకండ్ల మాధవాచార్యులు, వేదపండితులు, అర్చక బృందం నిర్వహించారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈవో దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



అలంకార మూర్తులను తిరువీధిలో ఊరేగిస్తున్న అర్చకులు, ఈవో

గరుధ వాహనంపై లక్ష్మీనరసింహుడు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వెండి గరుడ వాహనంపై ఊరేగింపు జరిపారు. శ్రీ మహావిష్ణువు ఇష్ట వాహనమైన గరుడ్మతుండి సేవలో స్వామివారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొలత పాతగుట్ట ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభువులను అభిషేకించి నిత్యపూజలు చేశారు. తులసీ దళాలతో అర్చించి హారతి నివేదన చేశారు. అర్చకబృందం, రుత్వికులు వేద పారాయణ పఠనం జరిపారు.

అనంతరం బంగారు, ముత్యాల ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, వివిధ రకాల పూలతో నూతన కల్యాణ మూర్తులు లక్ష్మీనృసింహులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు స్వామివారి గరుడ్మంత వాహనసేవపై అధిష్ఠింపజేసి తిరువీధుల్లో వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అలంకార సేవకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం 4 నుంచి 4.45గంటల వరకు శ్రీరామభక్తభజన (మల్లాపురం) భజన, 4.45 నుంచి 5.30గంటల వరకు శ్రీ గాయత్రి మహిళ భజన (యాదగిరిగుట్ట) మండలి భజన, 5.30 నుంచి 6.15గంటల వరకు జై శ్రీరామ మహిళ భజన (యాదగిరిగుట్ట) మండలి, 6.15 నుంచి 7గంటల వరకు హరీష్ డాన్స్ (యాదగిరిగుట్ట) అకాడమి, 7 నుంచి 7.45గంటల వరకు అన్నదానం సహస్ర, ఏలూరి యామిని (యాదగిరిగుట్ట), 7.45 నుంచి 8.30గంటల వరకు రాంపల్లి నర్సయ్య బృందం సాంస్కృతిక (హైదరాబాద్) విశ్వకళామండలి కూచిపూడి నృత్యాలు, గడ్డం సుదర్శన్ బృందం (యాదగిరిగుట్ట) చిందుయక్షగానం భక్తులకు అలరించాయి.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 18,59,854 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరీశుడి సేవలో సినీ దర్శకుడు విజయేంద్రప్రసాద్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. యాదగిరిగుట్ట క్షేత్ర సందర్శనకు మంగళవారం వచ్చిన ఆయన గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం గిరిప్రదక్షిణ విశిష్టత, కైంకర్యాల వైభవం, ఆలయ ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఈవో ఏ. భాస్కర్‌రావుతో చర్చించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం 10.30 గంటలకు మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థ స్నానాలు, సాయంత్రం 6గంటలకు దేవతోద్వాసన, పుష్పయాగం, దోలారోహణ మహోత్సవాలు నిర్వహించనున్నారు.

గోపలాయపల్లి గుట్టపై ధ్వజారోహణం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని హరిహర క్షేత్రంగా భాసిల్లుతున్న గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక అధ్యయన, బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణం చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేణుగోపాలస్వామి తిరు కల్యాణోత్సవానికి ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ అర్చక స్వాములు ధ్వజారోహణం గావించారు. అనంతరం గరుడముద్ద ఎగురవేశారు. కాగా ఈ గరుడముద్ద ఆరగించిన వారికి సంతాన, వివాహ యోగం కలుగుతుందనే విశ్వాసంతో పలువురు గరుడముద్దను ఆరగించారు. యాజ్ఞీకుడు ప్రతాపురం మత్స్యగిరి స్వామి ఆచార్యత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం: గోపలాయపల్లి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వారిజాల వేణుగోపాలస్వామి తిరు కల్యాణ మహోత్సవం ఘనంగా జరగనుంది. ఈ కల్యాణోత్సవానికి హైద్రాబాద్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు.



ధ్వజారోహణంతో దేవతలను ఆహ్వానిస్తున్న అర్చకులు

చెర్వుగట్టు జాతర హుండీ ఆదాయం రూ.16,45,100లు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం జాతర హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈనెల 2 నుంచి 10 వ తేదీ వరకు జరిగిన జాతరకు వచ్చిన భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న ఆదాయాన్ని లెక్కించగా రూ.16,45,100లు లభించినట్లు ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. గుట్ట కింద ఉన్న పార్వతీ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.3,19,600లు, గుట్టపైన ప్రధానాలయంతో పాటు ఉపాలయాల హుండీలను తెరిచి లెక్కించగా రూ.13,25,500లు కలిపి మొత్తం రూ.16,45,100లు లభించాయని ఈవో పేర్కొన్నారు.

పెద్దగట్టు జాతరకు వాహనాల దారి మళ్లింపు

- జాతర కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండో అతిపెద్ద జాతర అయిన లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర సందర్భంగా జాతీయ రహదారిపై వాహనాల దారి మళ్లింపు ఉంటుందని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పెద్దగట్టు జాతర జరుగుతున్నట్లు తెలిపారు. జాతరకు లక్షలాదిగా భక్తులు హాజరు కానుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జాతీయ రహదారిపై వాహనాల దారి మళ్లింపు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు..

16వ తేదీ ఉదయం నుంచి హైద్రాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు నార్కట్‌పల్లి నుంచి నల్లగొండ, మిర్యాలగూడ మీదుగా హుజూర్‌నగర్, కోదాడ నుంచి వెళ్లాల్సి ఉంటుందన్నారు.

విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు..

విజయవాడ నుంచి హైద్రాబాద్‌కు వైపు వెళ్లే వాహనాలు కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ నుంచి నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు హైద్రాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే వాహనాలు సూర్యాపేట మండలం టేకుమట్ల నుంచి నూతనంగా నిర్మించిన ఖమ్మం బైపాస్ రోడ్డు నుండి వెళ్లాలని సూచించారు. సూర్యాపేట- కోదాడ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రజా రవాణా వాహనాలు చివ్వెంల మండలంలోని వల్లభాపురం సమీపంలోని ఎస్ఆర్ఎస్పీ కాల్వ పక్క రోడ్డు నుంచి బీబీగూడెం మీదుగా సూర్యాపేటకు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

సూర్యాపేట నుంచి కోదాడ వైపు..

సూర్యాపేట నుంచి కోదాడకు వెళ్లే వాహనాలు కుడకుడ నుంచి ఐలాపురం మీదుగా ఖమ్మం జాతీయ రహదారి నుంచి నామవరం స్టేజీ నుంచి నామవరం గ్రామం మీదుగా జాతీయ రహదారి-65 గుం జలారు స్టేజీ వద్దకు చేరుకుని కోదాడకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. వాహనాల దారి మళ్లింపును వాహనదారులు గమనించాలన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇలా..

జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. సూర్యాపేట నుంచి జాతరకు వచ్చే వాహనాలను దురాజ్‌పల్లి శివారున గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్క నుంచి రాంకోటి తండాకు వెళ్లే దారిలో బైక్‌లు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలతో పాటు ఇతర వాహనాల కోసం పార్కింగ్ స్థలం కేటాయించినట్లు వివరించారు. గరిడేపల్లి, పెన్‌పహాడ్ వైపుగా వచ్చే వాహనాల కోసం పాత కలెక్టరేట్ కార్యాలయం వెనుక పార్కింగ్ స్థలం కేటాయించినట్లు తెలిపారు. కోదాడ, మునగాల వైపు నుంచి వచ్చే వాహనాల కోసం ఖాసీంపేట గ్రామం వైపు వెళ్లే దారిలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. దీంతో పాటు మోతె, చివ్వెంల మీదుగా వచ్చే వాహనాల కోసం పెద్దగట్టు వెనకాల గల స్థలాన్ని పార్కింగ్ కోసం కేటాయించినట్లు తెలిపారు. భక్తులు పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను నిలపాలన్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు భక్తులు పోలీసులకు సహకరించాలన్నారు.

రూ.359 కోట్లకు పైగా 'రైతుభరోసా'

నల్లగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని రైతులకు రెండు ఎకరాల వరకు రూ.359కోట్లకు పైగా రైతుభరోసా జమ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. నల్లగొండ జిల్లాలో 2,55,836మందికి రూ.173,80,5,778లను విడుదల చేశారు. సూర్యాపేట జిల్లాలో 1,50,334మంది రైతుల ఖాతాలో రూ.106,19,32,930 జమ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,20,607మంది రైతుల ఖాతాలో రూ.80,73,47,844లను రైతుల ఖాతాలకు చెల్లించారు.

16న హజ్ యాత్రికులకు శిక్షణ

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హజ్ యాత్రకు 2025వ సంవత్సరంలో వెళ్లే భక్తులకు ఈనెల 16 వతేదీన ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని అన్సారీ కాలనీలోని హజ్ కమిటీ హాలులో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా హజ్ సొసైటీప్రధాన కార్యదర్శి మహమ్మద్ అఫ్జలొద్దిన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు మౌలానా ఎహసానోద్దీన్, రాష్ట్ర హజ్ కమిటీ మౌలానా కిరామ్‌కీజేరిలు ముఖ్యఅతిథులుగా హాజరై భక్తులకు పలు సూచనలు, సలహాలు, తీసుకోవల్సిన జాగ్రతల వంటి అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9440970301 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డిని ఓడించే దమ్ముందా?



మోత్కూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటు కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు విమర్శించారు. మంగళవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ కొండగల్‌లో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి గెలిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటాననడాన్ని ప్రస్తావిస్తూ ఎక్కడైనా ఓడిపోయిన వాడి కోసం సీఎం రాజీనామా చేస్తారా? ఇవి మతి ఉన్నోడు మాట్లాడే మాటలేనా అని ప్రశ్నించారు. కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని ఓడించే దమ్మున్నోడే అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను పెట్టకుండా ఎన్నికల నుంచి ఎందుకు పారిపోయాడన్నారు. పెద్ద వ్యక్తిపై సవాల్ చేస్తే తాను పెద్దోడినై పోతానని కేటీఆర్ అనుకుంటుందని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబానిదే ఐరన్ లెగ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి దోస్తానా చేసిన ప్రతి ముఖ్యమంత్రి ఓడిపోతున్నారని, ఎవరిది ఐరన్ లెగ్గో అర్థం చేసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కనీసం కృతజ్ఞతలు చెప్పలేని కుసంస్కారులు కేసీఆర్, కేటీఆర్ అని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనన్నారు. ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, కల్యాణ్‌చక్రవర్తి, బద్దం నాగార్జునరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

కుల గణన సర్వే చరిత్రాత్మకం

- రాజకీయాల కోసం రాద్ధాంతం సరికాదు
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే నిర్వహించడం చరిత్రాత్మకమైనదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సర్వేలో 97శాతం మంది ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకున్నారని, 94863ఎన్యూమరేటర్లు, 9628మంది సూపర్‌వైజర్లు, 76000మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా కేవలం 50రోజుల్లో సర్వేను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. అయితే కొంతమంది రాజకీయ దురుద్దేశ్యంతో సర్వేను తప్పుపడుతున్నారని, రాజకీయాల కోసం రాద్ధాంతం సరికాదన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటించాలని, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం సరికాదన్నారు. ఓటరు జాబితా ఆధారంగా సర్వే లెక్కలు సరిగ్గా లేవని అనడం సరికాదని, ఓటరు లెక్కలకు సర్వే లెక్కలకు తేడా ఉంటుందన్నారు. ఒక్కో వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓట్లు ఉన్నాయని తెలిపారు.

ఓటరు గుర్తింపుకార్డుతో ఆధార్‌ను అనుసంధానిస్తే

దాదాపు 10లక్షల మందికి తెలంగాణలో, ఆంధ్రాలో ఓటు వేస్తున్న సందర్భాలు ఉన్నాయని ఆధార్‌ను అనుసంధానం చేస్తే ఓట్ల నమోదు సరిచేయవచ్చని అన్నారు. సక్రమంగా సర్వే నిర్వహించిన ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగులే ఈ సర్వేలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇంకా మూడు లక్షల కుటుంబాలు సర్వే అధికారులకు సమాచారం ఇవ్వలేదని, వారంతా సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు రెండు ఎకరాల వరకు రైతు భరోసాను ప్రభుత్వం అందించిందని ఎకరాకు రూ.6వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేసిందని, అదేవిధంగా సేద్యం చేస్తున్న భూమి అంతటికి త్వరితగతిన రైతుభరోసా అందించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు ప్రస్తుతం రైతుభరోసా పేరిట చెల్లింపులు జరుగుతున్నాయని, పెట్టుబడి సాయం వల్లనే పంటల విస్తీర్ణం, దిగుబడులు పెరిగాయన్నారు. ఇతర కార్యక్రమాలకు నిధులు ఆపి రైతులకు రైతుభరోసా ఇచ్చి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఎవరూ మాట్లాడిన అది తప్పేనని, కులాల మధ్య విద్వేషాలు పెంచేలా మాట్లాడటం సరైనది కాదన్నారు. మదర్ డెయిరీ అభివృద్ధి కోసం పాలకవర్గం, అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని, డెయిరీ ఆస్తులు విక్రయించడం సమస్యకు పరిష్కారం కాదన్నారు.

ప్రేమించకపోతే చంపేస్తా

- యువతిపై పెట్రోలు పోసిన యువకుడు
- నిప్పు అంటిస్తుండగా అడ్డుకున్న దుకాణదారు
- సూర్యాపేట జిల్లాలో ఘటన



యువతిపై పెట్రోలు చల్లుతున్న యువకుడు ప్రమోద్, (సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యం)

హుజూర్‌నగర్ , ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించకపోతే చంపేస్తానంటూ ఓ యువకుడు యువతిపై పెట్రోలు పోసి నిప్పు అంటించేందుకు ప్రయత్నించాడు. సమీపంలో ఉన్న ఓ దుకాణ యజమాని అప్రమత్తమై అడ్డుకోవటంతో ఆమెకు ప్రమాదం తప్పింది. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీ మంగళవారం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో విలేకరులు ఆరాతీయగా పోలీసులు కేసు వివరాలు వెల్లడించారు. హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం మోటమర్రి గ్రామానికి చెందిన ఓ మైనార్టీ యువతి(23) హుజూర్‌నగర్‌లోని తన మేనమామ ఇంట్లో ఉంటూ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. బీటెక్ చదివిన ఆమెకు అదే గ్రామానికి చెందిన సుందర ప్రమోద్‌కుమార్ పరిచయమయ్యాడు. పాఠశాల,కళాశాల విద్యలో ఆమెకంటే సీనియర్ అయిన ప్రమోద్ ఆమెతో పరిచయాన్ని ప్రేమగా మార్చి తనను ప్రేమించాలని వేధించాడు.

పెట్రోల్ తనపై చల్లుకుని.. యువతిపై పోసి

సోమవారం మధ్యాహ్నం మోటమర్రి నుంచి వచ్చిన ప్రమోద్‌కుమార్ ఆ యువతికి ఫోన్ చేసి 'నీతో మాట్లాడాలి.. ఆఫీసు నుంచి బయటకు రావాలని' కోరాడు. దీంతో ఆమె తన చెల్లితో పాటు బయటకురాగా ప్రమోద్‌కుమార్ ఒక్కసారిగా ఆ యువతిని దూషించి తనను ఎందుకు ప్రేమించడం లేదని గొడవ పడ్డాడు. తనవెంట ఓ బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోలును తనపై కొద్దిగా చల్లుకుని మిగిలిన మొత్తం ఆ యువతిపై పోశాడు. ప్రమోద్ దగ్గర ఉన్న అగ్గిపెట్టెను యువతికి అంటించేలోపు పక్కనే ఉన్న ఓ దుకాణ యజమాని పరుగున వచ్చి అగ్గిపెట్టె గుంజుకుని ప్రమోద్‌ను కొట్టి ఆ యువతిని అక్కడినుంచి పంపించివేశాడు. సంఘటనతో ఉలిక్కిపడ్డ యువతి ఇంటికి వెళ్లి తన మేనమామకు జరిగిన సంఘటనను చెప్పింది. ఈ ఘటనపై బాధితురాలు సోమవారం కుటుంబ సభ్యులతో వచ్చి హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీసీ ఫుటేజీతో వెలుగుచూసిన ఘటన

యువతిపై ప్రమోద్ పెట్రోల్ పోసిన సీసీ ఫుటేజీ మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ కాగా సమాచారం తెలుసుకున్న విలేకర్లు ప్రశ్నించటంతో పోలీసులు జరిగిన సంఘటన వివరాలు వెల్లడించారు. ఈ ఘటనలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమోద్ గత మూడేళ్లుగా ప్రేమ పేరుతో ఆ యువతిని వేధిస్తున్నట్లు తెలిసింది. ప్రేమించకపోతే చంపుతానని ఏడాదిగా ఆమెను బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ వేధింపులు తట్టుకోలేక ఆ యువతి హుజూర్‌నగర్‌కు వచ్చి ఉంటున్నట్లు సమాచారం.

సన్నధాన్యం బోనస్‌ను వెంటనే చెల్లించాలి

శాలిగౌరారం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన సన్నధాన్యానికి ప్రభుత్వం బోనస్‌ను వెంటనే రైతుల ఖాతాలో వేయాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్ డిమాండ్ చేశారు. శాలిగౌరారంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు నుంచి కొనుగోలు చేసిన సన్నధాన్యానికి రూ.500 బోనస్ డబ్బులు జమ చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు.

16న లడ్డూ, కొబ్బరికాయల విక్రయ హక్కుకు వేలం

శాలిగౌరారం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలం భైరవునిబండలో గంగా భవాని సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 1 వరకు బ్రహ్మోత్సవాలు, జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో లడ్డూ, కొబ్బరికాయలు విక్రయించడానికి ఈనెల 16న ఆదివారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దండ యాదగిరి రెడ్డి తెలిపారు.

సమయపాలన పాటించాలి



గట్టుప్పల్: వెల్మకన్నెలో అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న పీడీ కృష్ణవేణి

గట్టుప్పల్, మునుగోడు రూరల్ ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి సూచించారు. గట్టుప్పల్ మండలకేంద్రం మండలంలోని వెల్మకన్నె, మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు చిన్నారులకు అందించే పౌష్టికాహారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారం అందించడంతో పాటు విద్యను కూడా ప్రత్యేకంగా బోధించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేకపోతే కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రమునకు హాజరయ్యేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏసీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్ ఎం.శివేష, యాదమ్మ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెరగాలి


కస్తూర్బా విద్యాలయంలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఏపీడీ

కేతేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా క్షేత్రస్థాయి సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఏపీడీ లక్ష్మీనర్సింహారావు సూచించారు. మండలంలోని చీకటిగూడెం, చెరుకుపల్లి, కొర్లపహాడ్, బండపాలెం, కేతేపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో సాగుతున్న ఈజీఎస్ నర్సరీలు, ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను కూలీలు నిర్ణీత కొలతల మేరకు నిర్వహించాలన్నారు. పనులు సక్రమంగా జరిగేలా చూసే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనన్నారు. జరిగిన పనులను టీఏలు కొలతలు తీసి కూలీలకు లభించే కూలీని నిర్ణయించాలని సూచించారు. పనుల నిర్వహణ, కొలతల నిర్ధారణలో ఎక్కడ ఎలాంటి అవకతవకలు జరిగినా బాధ్యులపై తగిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆయన క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఏపీడీ వెంట ఏపీవో ఎస్.సురేందర్, ఈసీ లక్ష్మి, టీఏలు సైఫుద్దీన్, కృష్ణప్రసాద్, సైదులు తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


రామాంజపురం - ఉప్పలంచ గ్రామాల మధ్య రోడ్డు మీద పడిన గుంతలు

శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు అధ్వాన్నంగా మారాయి. రోడ్లపై ఉన్న గుంతలు దగ్గరకు వచ్చే వరకు కనిపించక పోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రామగిరి నుంచి గురజాల వరకు రామాంజపురం నుంచి ఉప్పలంచ వరకు తుడిమిడి నుంచి చిత్తలూరు వరకు రోడ్ల మధ్య లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ విభాగం అధి కారులు ఈ రోడ్లను పరిశీలించి మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి -శాలిగౌరారం)

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరు మర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయ న మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఒక్క దాంట్లో స్పష్టత లేదని ఏడాది నుంచి ప్రజలకు మభ్యపెడుతూ ప్రభుత్వం కాలం వెల్లదీస్తుందన్నారు. ప్రజాపాలనలో ప్రజలకు లబ్ధి చేకూ రిందేమి లేదన్నారు. సంక్షేమ పథకాలంటూ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం చేస్తూ 14 నెలల పాలనలో ప్రజలకు ఏం చేసిందేంమిటో చెప్పాలని ప్రశ్నించారు. రేషన్ కార్డులు, ఇండ్లు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేసి ప్రజలకు, రైతులకు బాసటగా నిలవాలన్నారు. కులగణన సర్వే అంతా తప్పుల తడకని తప్పుడు సర్వేలతో ప్రజలను మోసం చేసే కుట్రలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుం దన్నారు. రిజర్వేషన్లపై తీర్మాణం చేయడం కాదూ చట్ట బద్ధతను కల్పించాలన్నారు. కాంగ్రెస్ పాలనలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అణచి వేయబడ్డారన్నారు. ఇచ్చిన హామీలను నెర వేర్చాలని తప్పులు ఒప్పుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పి కులగణనను మళ్లీ చేపట్టాలని డిమా ండ్ చేశారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఎంత ఉన్నదో చెప్పేందుకు నల్లగొండలో జరిగిన రైతు మహాధర్నానే నిదర్శనమన్నారు.

కేతేపల్లి ఎంపీటీసీ స్థానాల ఓటరు జాబితా విడుదల

కేతేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాను మంగళవారం కేతేపల్లి మండల పరిషత్ అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుపై తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు. మండలంలోని 16గ్రామాల్లో 31,261మంది ఓటర్లు ఉండగా ఒక్కో పోలింగ్ బూతులో 578మంది ఓటర్ల చొప్పున ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 54పోలింగ్ బూతుల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆయా గ్రామాల్లో 15,218మంది పురుష ఓటర్లు, 16,042మంది మహిళా ఓటర్లు ఉండగా ఒక్కరు థర్డ్‌జండర్ ఉన్నారు. ఓటరు జాబితా విడుదల కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి, సూపరింటెండెంట్ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ పరిధి,ఓటర్లు	
గుడివాడ	2,937
కాసనగోడు	2,803
కొత్తపేట	2,919
కొర్లపహాడ్	3,136
ఇనుపాముల	3,026
కేతేపల్లి	2,865
కేతేపల్లి-2	3,082
చెరుకుపల్లి	2,574
తుంగతుర్తి	2,409
కొప్పోల	2,500
భీమారం	3,010

ఒలింపియాడ్‌లో సాందీప్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఇండియాస్ ఫస్ట్ స్కిల్ ఒలింపియాడ్ లెవెల్ - 2 పోటీల్లో నల్లగొండ సాందీప్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల చెందిన ఆరుగురు విద్యార్థులు అత్యుత్తమ మేధా సంపత్తితో రెండవ స్థాయిలో నిలిచారు. విజేతలు రూ.25 వేల చెక్కును, ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల వ్యవహర్త గానూతల సత్యనారాయణ రెడ్డి వర్షం వ్యక్తం చేస్తూ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

ఐక్యతతో ముందుకు సాగాలి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఐక్యతతో ముందుకు సాగినప్పుడే సమస్యలను పరిష్కరించుకోగలుగుతామని మ్యారేజ్ బ్యూరోస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎంబీఏ) జేఏసీ ఛైర్మన్ వి.అర్జున్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్ బ్యారేజ్ బ్యూరోస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జేఏసీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మ్యారేజ్ బ్యూరోలు చిన్న, చిన్న సమస్యలు ఉంటే జేఏసీ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్ర మంలో మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ గోలి రజితా రెడ్డి, అధ్యక్షుడు గోలి భూపాల్ రెడ్డి. ప్రధాన కార్య దర్శి కస్తూరి రాజు నాయుడు, క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ కాసాల యాదగిరి రెడి పాల్గొన్నారు

కులగణన సర్వేతో బీసీలకు అన్యాయం

శాలిగౌరారం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే చేసి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లమ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులగణన సర్వే బీసీ సమాజాన్ని కించపరిచే విధంగా ఉందన్నారు. సర్వేలో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి చూపిం చారని, ఉన్నత కులాలను ఎక్కువ చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు.

పీఆర్సీ అమలుకు బలమైన పోరాటం చేస్తా

-ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తన గెలుపు ద్వారా బీసీల రాజ్యాధికారానికి బాట పడుతుందని వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. సబ్బండవర్గాల మద్దతుతో బరిలో ఉన్నానని పేర్కొన్నారు. ఉపాధ్యాయ మిత్రుల ఆశీర్వాదంతో చట్టసభలో అడుగుపెడతానని విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ అమలు కోసం బలమైన పోరాటం నిర్వహిస్తానన్నారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ప్రభుత్వ ప్రకారంగా రావాల్సిన బెనిఫిట్స్ కొరకు నిరంతరం పోరాటం చేస్తానన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు పంకజ్ యాదవ్, బీసీసంక్షేమ సంఘం నాయకులు మిర్యాల యాదగిరి, దుడుకు లక్ష్మీ నారాయణ మునాస ప్రసన్న కుమార్, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటల కోసం చెట్ల తొలగింపు


వట్టిపల్లి గ్రామంలో హరితహారం చెట్లు తొలగిస్తున్న దృశ్యం

మర్రిగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 372లో జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన 3.13 ఎకరాల భూమి ఉన్నది. 2017లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా అధికారులు 1000 కానుగ మొక్కలు నాటారు. అవి పెరిగి చెట్లుగా మారాయి. రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు వారం రోజుల కిందట కొంతమంది యంత్రాల సాయంతో చెట్లను తొలగించారు. ఆటల పోటీల కోసం పచ్చని చెట్లను తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా చెట్లను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అదేవిధంగా గ్రామ కార్యదర్శికి సైతం ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి వంశీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా చెట్లను తొలగించిన విషయం తమ దృష్టికి ఆలస్యంగా వచ్చిందన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

కనగల్, ఫిబ్రవరి 11 , (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పగిడిమర్రి గ్రామంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, గోవిందాంబ సమేత శ్రీమద్వి రాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీజమదగ్ని రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణమహోత్సవం మామిడి తోరణాలు, మేళతాళాలు, సన్నాయివాయిద్యాలు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కనుల పండువగా జరిగింది. కల్యాణానికి మాజీ సర్పంచులు గోలి భాగ్యమ్మానర్సిరెడ్డి దంపతులు, గోలి రజితా జగాల్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యావాహచన పూజలను అర్చకులు నర్సయ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణనంతరం ఎల్లమ్మ భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించుకున్నారు. కాగ బుదవారం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సత్తయ్య రవీందర్ సైదులు, కేశవరెడ్డి, క్రిష్టారెడ్డి, నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకన్న తదితరులున్నారు.

ఆర్థిక సాయం


లింగస్వామికి ఆర్థిక సాయం అందజేస్తున్న జ్వాల యూత్ సభ్యులు

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన నందిపాటి లింగస్వామి ఎడమ కాలుకు ఇన్ఫెక్షన్ కావడంతో ఇటీవల వైద్యులు తొల గించారు. అతడిది నిరుపేద కుటుంబం కావడతో స్థానిక జ్వాలా యూత్ సభ్యులు రూ. 17,200 సేకరించి మంగళవారం లింగస్వామికి అందజేశారు.

సీపీఎం నాయకుడు లింగయ్య మృతి

కనగల్, ఫిబ్రవరి 11: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం గ్రామ మాజీ సర్పంచ్ సీపీఎం సీనియర్ నాయకుడు జినుకుంట్ల లింగయ్య మంగళవారం మృతి చెందారు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్రకమిటీ సభ్యుడు ముదిరెడ్డి సధాకర్‌రెడ్డి, ఐలయ్య, కానుగు లింగస్వామి లింగయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లింగయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. అలాగే మజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ నాయకులు లింగయ్య మృతదేహానికి నివాళులర్పించారు నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ కరీంపాషా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్ తోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు లింగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన కృషి గుర్తు చేసుకున్నారు.

రంగరాజన్‌పై దాడి హేయం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని ఆదిశైవ అర్చక బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ అన్నారు. రంగరాజన్‌పై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఇది హిందూ ధర్మంపైనే జరిగిన దాడిగా పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

● కనగల్: చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ అర్చక సంక్షేమ బోర్డు సభ్యుడు, దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ ముఖ్య అర్చకుడు చిలకమర్రి శ్రవణ్ కుమారాచార్యులు కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్చకులకు రక్షణ కల్పించాలన్నారు.

ఘనంగా పరిపాలన దినోత్సవం


మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల విద్యా గ్రామర్ హైస్కూల్‌లో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్యేల వేషధారణలతో మాక్ అసెంబ్లీని నిర్వహించి ఆకట్టుకున్నారు. అనంతరం క్లాక్ టవర్ సెంటర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి అధికార, ప్రతిపక్ష నాయకుల హోదాల్లో పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బొల్లం లింగయ్య యాదవ్ ఉపాధ్యాయులు బి. సైదులు, ధనలక్ష్మీ, మట్టయ్య, గౌస్, ఫర్హానా, కళ్యాణి, నరసింహ, రాములు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయం


దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్య క్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఉపా ధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. పండిట్ దీన దయాళ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు నూకల వెంకట్ నారాయణరెడ్డి, చింత ముత్యాలరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేత

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): మిషన్ పరివర్తన్ కింద యువతేజంలో భాగంగా నార్కట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో విజేత ఎస్‌పీఆర్ పాఠశాల జట్టు క్రీడా కారులకు ఎస్ఐ క్రాంతికుమార్ ట్రోఫీలను అందజేశారు. మండల స్థాయి విజేత జట్టు డివిజన్ స్థాయి పోటీలకు వెళ్తారని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు తదితర పీసీలు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.137	210	235
సూర్యాపేట	రూ.131	182	212
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 19.0

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం

ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గుర్తింపు

కోళ్లు దిగుమతి కాకుండా రాష్ట్ర సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టులు



నల్లగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో కొద్ది రోజుల క్రితం కోళ్లు మృత్యువాత పడగా, అందుకు బర్డ్‌ఫ్లూ కారణం కాదని రాష్ట్ర పశుసంవర్ధకశాఖతో పాటు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాతో పాటు ఉభయ గోదావరి, పలు జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బర్డ్‌ఫ్లూతో ఏపీలో కోళ్లు మృతిచెందాయని తెలిసిన వెంటనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు కోదాడ, వాడపల్లి, నాగార్జున సాగర్‌లో మూడు చెక్‌పోస్టులను అధికారులు ఏర్పాటు చేశారు. ఏపీ నుంచి కోళ్లు సరఫరా చేసే వాహనాలను ఈ చెక్‌పోస్టుల వద్ద నిలిపి ఆ రాష్ట్రానికి తిప్పి పంపిస్తున్నారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ ముంచుకొస్తుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు కోళ్ల ఫాములను ముమ్మరంగా తనిఖీచేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో కోళ్లు మృతిచెందినట్టు అధికారికంగా ప్రకటన లేదు. యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా కోళ్ల ఫాములు ఉండగా నల్లగొండ ఆ తరువాత స్థానంలో ఉంది. సుమారు 80లక్షల కోళ్లు ఉమ్మడి జిల్లా పరిధిలో పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలో మూడు నెలల పాటు కోడి మాంసంతో పాటు కోడి గుడ్లను తినకుండా ఉండాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా బర్డ్‌ఫ్లూ లక్షణాలు కన్పిస్తే కోళ్ల దుకాణాలను మూసివేసేందుకు నిర్ణయం తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి.

చెక్‌పోస్టుల వద్ద అధికారులు

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి రాష్ట్ర సరిహద్దు వద్ద పోలీసులు, పశువైద్యశాఖ అధికారులు సంయుక్తంగా చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు. ఏపీ నుంచి రాష్ట్రంలోకి కోళ్లు తరలించకుండా అధికారులు ఇక్కడ నిఘా ఏర్పాటుచేశారు. ఇక్కడికి వచ్చే వాహనాల్లోని కోళ్లను తనిఖీచేసి వ్యాధి లక్షణాలు ఉన్న కోళ్లను వెనక్కి పంపుతున్నారు. ఇప్పటివరకు వ్యాధిసోకిన కోళ్లు రాలేదని సంబంధిత అధికారులు తెలిపారు.

పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు

మరో నాలుగు రోజులే

▸▸ పొడిగింపా లేక ప్రత్యేక అధికారులా? ▸▸ సీఎం వద్ద సహకార సంఘాల ఫైల్

నల్లగొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాల గడువు ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. అయితే పాలకవర్గాల గడువు మరికొంత కాలం పొడిగిస్తారా? లేక ప్రత్యేక అధికారులను నియమిస్తారా? అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలతో పాటు మునిసిపల్ పాలకవర్గాల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో పాలకవర్గాల గడువు పొడిగించకపోతే బ్యాంకుల అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. నెలలపాటు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగితే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలు రైతులకు దూరమవుతాయి.

అయితే పాలకవర్గాల గడువు పొడిగించాలని రాష్ట్రంలోని అన్ని డీసీసీబీల చైర్మన్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. పీఏసీఎస్‌ల గడువు 15వ తేదీతో ముగుస్తుండగా, డీసీసీబీ పాలకవర్గం గడువు ఈనెల 24తో ముగియనుంది. పీఏసీఎస్‌ల గడువు పొడిగించకపోతే డీసీసీబీ పాలకవర్గానికి కూడా ఎలాంటి బాధ్యతలు ఉండవు. పీఏసీఎస్‌ల గడువు పొడిగించకుంటే డీసీసీబీ పాలకవర్గాల బాధ్యతలు కూడా ముగిసిపోతాయి. ప్రస్తుతం గడువు పెంపు ఫైల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నట్టు సమాచారం. ఈనెల 13న లేదా 14న సహకార సంఘాల గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందో పీఏసీఎస్‌ల పాలకవర్గాలతోపాటు డీసీసీబీ పాలకవర్గం ఎదురుచూస్తోంది.

అప్పు చేసి పప్పు కూడు

ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అందని బిల్లులు



భోజనం చేస్తున్న విద్యార్థులు

కోదాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యను దగ్గర చేయాలనే తలంపుతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తోంది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఏజెన్సీలను నియమించింది. అందుకు అవసరమైన బియ్యం మినహా ఇతర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసినందుకు ఏజెన్సీలకు ప్రభుత్వం నెలనెలా బిల్లులు చెల్లించాలి. కాగా, 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రతీ నెల బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుండగా, హైస్కూల్ పరిధిలో ఉండే 9, 10వ తరగతి విద్యార్థులకు చెందిన బిల్లులు మాత్రం ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఏజెన్సీల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 580 ఏజెన్సీలు ఉన్నాయి. హైస్కూల్ విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.10.67 చెల్లిస్తోంది. కాగా, 9, 10వ తరగతి విద్యార్థుల చెందిన బిల్లులు గత ఏడాది సెప్టెంబరు నుంచి ప్రభుత్వం బకాయి పడింది. ఈ మొత్తం సుమారు రూ.3,64,91,000 వరకు ఉంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బిల్లులు రాకపోవడం, ఐదు నెలలుగా గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అప్పు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 580 ఏజెన్సీలు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 580 వరకు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 34,200మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈపాఠశాలల్లో 580మధ్యాహ్న వంట ఏజెన్సీలు ఉన్నాయి. 9,10వతరగతి విద్యార్థులకు ప్రభుత్వం రోజుకు రూ.10.67 చొప్పున చెల్లించాలి. ఈలెక్కన నెలకు సుమారు రూ.73లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఐదు నెలలుగా బిల్లులు రాకపోవడంతో బకాయి రూ.3.65కోట్లకు చేరింది.

అప్పుచేసి సరుకులు తెస్తున్నాం

బిల్లులు రాకపోవడంతో ప్రతీ రోజు ఇబ్బందులు పడి సరుకులు కొనుగోలు చేసి తెస్తున్నాం. తెలిసిన వారి వద్ద వడ్డీకి డబ్బు తెచ్చి సరుకులు కొనుగోలుచేస్తున్నాం. అటు కూలి గిట్టుబాటుగాక, ఇటు వడ్డీ పెరిగి ఆర్థిక భారం పడుతోంది. అధికారులను అడిగితే పైనుంచి రానిదే తామేం చేయలేమంటున్నారు. కిరాణా దుకాణంలో ఇప్పటికే రూ.50వేలు బాకీ దాటింది. పాతబాకీ చెల్లిస్తేనే సరుకులు ఇస్తామంటున్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి. అదే విధంగా గౌరవ వేతనం ఐదు నెలలుగా రావడం లేదు. వెంటనే బిల్లులతోపాటు గౌరవ వేతనం కూడా చెల్లించాలి.

- శివరాత్రి సుజాత, నిర్వాహకురాలు

కడుపు కోత





▸▸ సాధారణ ప్రసవాలను మరిచిన ప్రైవేట్ వైద్యులు ▸▸ శస్త్రచికిత్సకే మొగ్గు
▸▸ కొందరు సుముహూర్తాల పేరుతో ప్రసవాలు ▸▸ సొమ్ముచేసుకుంటున్న వైద్యులు

ధనార్జనే ధ్యేయంగా కొంత మంది వైద్యులు సాధారణ ప్రసవాలు చేయడంలేదు. ఆస్పత్రికి వచ్చిన వారి నుంచి డబ్బు వసూలు చేసి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ శస్త్ర చికిత్సల ద్వారా భవిష్యత్‌లో మహిళలకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. అయినా గర్భిణులు చేసేది లేక వైద్యుల మాటలు విని శస్త్ర చికిత్స చేయించుకుంటున్నారు. కొంత మంది గర్భిణులు ప్రసూతి నొప్పులు భరించలేక శస్త్రచికిత్స చేయించుకుంటుండగా, మరికొందరు సుముహూర్తం పేరుతో శస్త్రచికిత్సకు మొగ్గు చూపుతున్నారు. దీంతో సాధారణ ప్రసూతులకంటే శస్త్రచికిత్సలు రెట్టింపు సంఖ్యలో జరుగుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్), నల్లగొండ

సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో కొంత మంది వైద్యులు డబ్బు ఆశతో గర్భిణులకు కడుపు కోత మిగులుస్తున్నారు. ఒక్కో శస్త్రచికిత్సకు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు. సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉన్నా ఏదో ఒక సాకు చెబుతూ శస్త్రచికిత్స చేస్తున్నారు. సాధారణ ప్రసూతికి వైద్యులు యత్నించడం మానేశారు.

నాలుగు రెట్లు పెరిగిన శస్త్ర చికిత్సలు

సూర్యాపేట జిల్లా పరిధిలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వరకు 9,141 ప్రసవాలు జరిగాయి. అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 4,123 ప్రసవాలు జరిగాయి. అందులో సాధారణ ప్రసవాలు 2,410 వరకు, శస్త్రచికిత్సలు 1,713 వరకు ఉన్నాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో 5,018 ప్రసవాలు జరగ్గా, అందులో 921 సాధారణ ప్రసవాలు, 4,097 శస్త్ర చికిత్సలు ఉన్నాయి. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో సుమారు నాలుగు రెట్లు శస్త్రచికిత్సలు జరిగాయి. నల్లగొండ జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు మొత్తం 21,906 ప్రసవాలు జరిగాయి. అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11,732 ప్రసవాలు జరగ్గా, వీటిలో సాధారణ ప్రసవాలు 5,630 ఉన్నాయి. శస్త్ర కి చిత్సలు 6,102 జరిగాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మొత్తం 10,174 ప్రసవాలు జరగ్గా అందులో 1,892 సాధారణ ప్రసవాలు, 8,281 శస్త్రచికిత్సలు ఉన్నాయి. జిల్లాలో సుమారు నాలుగురెట్లు అధికంగా శస్త్రచికిత్సలు జరిగాయి.

ఆపరేషన్లకు మొగ్గు చూపుతున్న కొందరు

గర్భం దాల్చిన మహిళలు కొంత మంది ఆపరేషన్ల ద్వారా డెలివరీ అయ్యేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రసూతి సమయంలో సాధారణ డెలివరీ అవ్వాలంటే నొప్పులు భరించాల్సి వస్తుంది. అయితే ప్రస్తుత సమాజంలో కొంత మంది మహిళలు నొప్పులు భరించలేక ఆపరేషన్ ద్వారా డెలివరీ అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా సాధారణ పద్ధతిలో ప్రసూతి చేసేందుకు వైద్యులు సైతం ప్రయత్నాలు చేయడం లేదు. సాధారణ ప్రసూతి సమయంలో కొన్ని సందర్భాల్లో కొంత మంది గర్భిణులు మృతి చెందుతున్నారు. అలాంటి సందర్భాల్లో మృతురాలి బంధువులు ఆసుపత్రుల వద్ద ఘర్షణలకు పాల్పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కూడా వైద్యులు ఆపరేషన్ చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఆపరేషన్ ద్వారా డెలివరీ చేయడం వైద్యులకు సులభతరం. అంతేగాక సాధారణ ప్రసూతి కంటే అధిక మొత్తం డబ్బు వస్తుండటం కూడా కారణం.

సుముహూర్తాల కోసం..

గర్భం దాల్చిన మహిళలు ప్రసూతి అయ్యే సమయాన్ని ముందుగానే స్కానింగ్ రిపోర్ట్ ద్వారా తెలుసుకుంటున్నారు. దీంతో పాటుప్రసూతి అయ్యే సమయంలో..

- మిగతా 8వ పేజీలో..

అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తే చర్యలు

ప్రసూతి కోసం వచ్చే గర్భిణులకు అవసరం లేకున్నా ఆపరేషన్లు చేసే వైద్యులపై చర్యలు తీసుకుంటాం. సాధారణ ప్రసవం చేసేందుకు వైద్యులు ప్రయత్నించాలి. అధికంగా ఆపరేషన్ల ద్వారా కాన్పులు చేసే ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. మహిళల ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్లు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధికశాతం సాధారణ ప్రసూతికే ప్రాధాన్యం ఇస్తున్నాం. మహిళలు కూడా సాధారణ ప్రసూతికి చొరవ చూపాలి.

- డాక్టర్ కోటా చలం, డీఎంహెచ్‌వో, సూర్యాపేట

నిబంధనల మేరకు ఓట్లు లెక్కించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న అహ్మద్ నదీం

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నామినేషన్ల పరిశీలన అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టే ఆర్జాలబావి వద్ద గోదామును కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్‌లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్టేజ్-1, 2 అధికారుల శిక్షణలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడారు. మొత్తం 66 మందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహ నిర్మాణశాఖ పీడీ రాజకుమార్, మాస్టర్ ట్రైనర్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

(ఆంధ్రజ్యోతి, చండూరు రూరల్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడంగిపర్తి మహాత్మా జోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, తరగతి గదులు, వంటలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాను ఎంత కష్టపడి చదివి ఈ స్థాయిలో చేరారో వారికి వివరించారు. విద్యార్థులు సైతం తనలా ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి కష్టపడి చదవాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఆర్డీవో శ్రీదేవి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, తహసీల్దార్ దశరథ, మునిసిపల్ మేనేజర్ అరుణ, పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి, చండూరు): చండూరు ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వైద్య సేవలు పొందుతున్న రోగుల రికార్డులను పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిశాక సంబంధిత అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని పోస్టులు భర్తీ చేస్తామన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పట్టణంలో మరో చోటికి తరలించేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన భవన నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వ నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద జిల్లా సరిహద్దును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చిత్రంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ కొండల్‌రెడ్డి

శాలిగౌరారం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినా, డంప్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని వంగమర్తి ఇసుక రీచ్‌లను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, డంపింగ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో చెక్ పోస్టులు, నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలిస్తే డయల్ 100గానీ, సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. ఆయన వెంట డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సీఐ కె.కొండల్‌రెడ్డి, ఎస్ఐ డి.సైదులు, తదితరులు ఉన్నారు.

కానిస్టేబుళ్లకు రివార్డు

(ఆంధ్రజ్యోతి, కనగల్): కనగల్ పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుళుగా పనిచేస్తున్న పి.శేఖర్, వై.నగేష్‌కు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం నల్లగొండలో రివార్డులు అందజేశారు. మండలంలోని చినమాధారం జంటహత్య కేసులు, పర్వతగిరి కల్లు గుడిసెలో మహిళ దారుణ హత్య కేసులో సరైన ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడేలా చేశారని ఎస్పీ ఈ సందర్భంగా ప్రశంసించారు. అదేవిధంగా హర్యాణాలో మార్చి 6 నుంచి జరిగే జాతీయ పోలీస్ క్రీడలకు ఎంపికైన కానిస్టేబుల్ బేబీశాలినికి నగదు బహుమతిని అందజేశారు.

‘ఉపాధి’ పనులు కల్పించడంలో నిర్లక్ష్యం తగదు

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



మహమ్మదాపురంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

నాంపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు పని కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మహ్మదాపురం గ్రామంలోని నర్సరీ మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ గ్రామంలో 50మంది కూలీలకు తప్పకుండా పని కల్పించాలన్నారు. ఇప్పటి వరకు మహమ్మదాపురం గ్రామంలో పనులు ప్రారంభం కాలేదని శుక్రవారం వరకు కూలీలకు పని కల్పించాలని, లేదంటే సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈనెల చివరి నాటికి స్థానికంగా దొరికే విత్తనాలతో నర్సరీలో మొక్కలు పెంచాలన్నారు. ప్రభుత్వం తోటల పెంపకానికి వందశాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశం, సిబ్బంది లింగయ్య, అంజయ్య, ఈశ్వరయ్య, భాస్కర్, నాగయ్య, అజయ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పదిలో వంద శాతం

ఉత్తీర్ణత సాధించాలి

విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి



మధ్యాహ్న భోజన వంటను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. మండలంలోని అక్కెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్)పై కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎఫ్‌పీని ఉపాధ్యాయులు సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. ప్రతీ తరగతి గదిలో ఐఎఫ్‌పీపై బోధన చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. మెనూ పాటించాలని, ఆహారాన్ని నాణ్యతగా తయారు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఉపాధ్యాయులు కూడా ప్రతీ రోజు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని ఆదేశించారు. డీఈవో వెంట పాఠశాల హెచ్‌ఎం ఎన్.వెంకటేశ్, రిసోర్స్ పర్సన్స్ సతీశ్‌కుమార్, సుజాత ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలో జరిగిన సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందన్నారు. పార్టీ శ్రేణులు అన్ని గ్రామాల్లో కొత్త శాఖల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీచేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. డిండి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదిస్తు అసెంబ్లీ ఆమోదాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఉప్పునూతల వెంకటయ్య, బొడ్డుపల్లి వెంకటరమణ, బుచ్చిరెడ్డి, మైనుద్దీన్, వెంకటయ్య, జయరాములు, పాండురంగారెడ్డి, నూనె రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



గట్టుప్పల్‌లో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న ఏడీ ద్వారక్

గట్టుప్పల్,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):చేనేత కార్మికులకు అభయహస్తం, నేతన్న పొదుపు పథకాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జౌళి శాఖ ఏడీద్వారక్ అన్నారు.స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు పథకానికి వివర్ రూ.1,200, అనుబంధ కార్మికులు రూ.600 చెల్లించాలన్నారు. ఈ పథకానికి ప్రీపియంను 36 నెలల నుంచి 24నెలలకు ప్రభుత్వం కుదింపు చేసిందన్నారు. జియోట్యాగ్ ఉన్న ప్రతీ చేనేత కార్మికుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జౌళిశాఖ ఏడీవో గోపాల్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని తెలుపుతూ ఆరోపణ వచ్చాయి. దీంతో జిల్లా అధి కారి స్వప్న మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ మల్లీశ్వరితో పాటు సిబ్బంది, విద్యార్థుల నుంచి వేర్వేరుగా వివరాలు సేకరించినట్లు తెలిసింది. అయితే సదరు అధికారి మీడియాను పాఠశాల లోపలికి అనుమతించకుండా వివరాలు వెల్లడించకుండా వెళ్లడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు.

చిన్నారులకు చేయూత

చింతపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని నసర్లపల్లి, విం జమూర్‌కు చెందిన ఇద్దరు చిన్నా రులు మానసికంగా ఇబ్బందులు పడు తు న్నారు. దీంతో వెంకటేశ్వరనగర్ (మాల్)కు చెందిన నాగార్జున పాఠశాల ప్రిన్సి ఎ బాదేపల్లి పులి రాజ్‌గౌడ్ ఇద్దరిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ ఆస్ప త్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వ హించారు. రూ. 20 వేలు అందజేశారు. చిన్నారుల తల్లిదండ్రులు పులిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీసీల హవా

» నిడమనూరు మండలంలో 29 పంచాయతీలకు 16 మంది బీసీ సర్పంచులు » 13 ఎంపీటీసీలకు గాను ఏడుగురు వారే

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ముసాయిదా ఓటరు జాబితాను కూడా ప్రచురించింది. కానీ ముందు పంచాయతీ ఎన్నికలా ..లేక ప్రాదేశిక ఎన్నికలు జరుగుతాయా అనేది తేల్చడం లేదు. గ్రామాల్లో మాత్రం రచ్చబండల వద్ద ఎక్కడ చూసినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే చర్చ జరుగుతోంది. ఆశావహులు సైతం రిజర్వేషన్ల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నిడమనూరు)



మండలంలో గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటారు. ఇటు పంచాయతీలు అటు ప్రాదేశిక ఎన్నికల్లోనూ వారిదే పైచేయిగా నిలిచింది. రిజర్వేషన్ స్థానాలతో పాటు అనేక చోట్ల జనరల్ స్థానాల్లోనూ బీసీలే గెలిచారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా బీసీలకు ఎనిమిది, ఎస్సీలకు ఆరు, ఎస్టీలకు ఒకటి, జనరల్ అభ్యర్థులకు 14 పంచాయతీలు కేటాయించారు. బీసీలకు బంటువారిగూడెం, సోమారిగూడెం, ముకుందాపురం, వడ్డెరగూడెం, నందికొండవారిగూడెం, రాజన్నగూడెం, వెంకటాపురం, ఎర్రగూడెం వంటి 8 పంచాయతీలు రిజర్వ్ చేశారు. వీటికితోడు ఊట్కూరు, ముప్పారం, బొక్కమంతలపహడ్, రేగులగడ్డ, వల్లభాపురం, సూరేపల్లి, ఇండ్లకోటయ్యగూడెం, వేంపాడ్ వంటి మరో 8 జనరల్‌కు కేటాయించిన గ్రామాల్లోనూ సైతం పోటీ చేసి బీసీలే గెలిచారు. దీంతో మండలంలో 29 పంచాయతీలకు 16 మంది బీసీ సర్పంచులే నెగ్గారు. మండలంలో అన్ని వర్గాలకు చెందిన మహిళలకు 15 గ్రామ పంచాయతీలు రిజర్వు చేశారు. కానీ మహిళలకు కేటాయించిన 15 పంచాయతీలతో పాటు నిడమనూరు, సూరెపల్లి గ్రామ పంచాయతీల్లో సైతం మహిళలే గెలిచారు. అంటే మండలంలో 29 పంచాయతీలకు 17 మంది మహిళా సర్పంచులు ఎన్నికయ్యారు.

జనరల్ స్థానాల్లోనూ గెలుపు

మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఊట్కూరు, వల్లభాపురం, మారుపాక, నిడమనూరు-2 సీట్లు బీసీలకు రిజర్వు చేయడం జరిగింది. ఈ నాలుగింటితో పాటు జనరల్ అభ్యర్థులకు కేటాయించిన ముప్పారం, ముకుందాపురం, నిడమనూరు-1 వంటి మూడు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో 13 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏడు స్థానాల్లో బీసీలే గెలిచారు. అదే విధంగా ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించగా బీసీ మహిళ ఎంపీపీ అయ్యారు. జడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు కేటాయించగా ఓసీ మహిళ విజయం సాధించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 22 శాతం కేటాయించగా ఇప్పుడు కుల గణన పూర్తవడంతో 42 శాతం కేటాయించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కోటా పెరిగితే బీసీలకు మరింత ప్రాతినిధ్య పెరుగుతుందని పలువురు భావిసున్నారు. గ్రామాల్లో ఆశావహులు స్థానిక సంస్థల ఎన్నికల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

జోరుగా గుడుంబా విక్రయాలు

దేవరకొండ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో సారా విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో దాడులు చేస్తున్నప్పటికీ అడ్డుపడడం లేదు. - (ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

● బీదర్ నుంచి నల్లబెల్లం పౌడర్ రవాణా ● ఎక్సైజ్ అధికారులు దాడులు చేసినా ఆగని వైనం



సారా తయారికి ఉపయోగించే బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు 605 ఎక్సైజ్ కేసులు నమోదు చేయగా 335 మందిని అరెస్ట్ చేశారు. 1819. 75 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 22,417 కిలోల నల్లబెల్లం పౌడర్, 7 వాహనాలను సీజ్ చేశారు. దీని బట్టి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. సారా తయారీకి కావాల్సిన నల్లబెల్లం పౌడర్ బీదర్ నుంచి హైదరాబాద్ పటాన్‌చెరు మీదుగా దేవరకొండకు రవాణా జరుగుతుంది.

డివిజన్ సర్కిల్ పరిధిలోని చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, గుడిపల్లి, కొండమల్లేపల్లి, చింతపల్లి, దేవరకొండ మండలాల్లో సారా విక్రయాలు కొనసాగుతున్నాయి. గతేడాది నవంబరులో చందంపేట మండలంలో సారా విక్రయాలపై దాడులకు వెళ్లిన ఎక్సైజ్ పోలీసులపై తండావాసులు దాడులకు దిగి ఎక్సైజ్ వాహనాల అద్దాలు ధ్వంసం చేసిన సంఘటనలు ఉన్నాయి. వాహనాల్లో నల్లబెల్లం పౌడర్, పటిక విక్రయాలు జరిపి గుడుంబా విక్రయదారులు వ్యవసాయ పొలాలు, గుట్టలు, గ్రామ శివారుల్లో బట్టీలు తయారు చేసి సారా తయారు చేస్తున్నారు. చందంపేట మండలం నుంచి సారా ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, ఇతర ప్రాంతాలకు పడవల ద్వారా రవాణా అవుతోంది. సారా లీటరు తయారీకి దాదాపుగా రూ. 50నుంచి 60 వరకు ఖర్చు అవుతున్నది. దానిని రూ.100 నుంచి 150 వరకు విక్రయిస్తుండడంతో ఆ లాభసాటి వ్యాపారంగా మారింది. సారా తయారు చేసి గ్రామాలు, తండాల నుంచి ఇతర ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై వ్యాపారులు సారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నాం



సారా తయారీదారులపై నిఘా ఏర్పాటు చేశాం. సర్కిల్ పోలీసులతోపాటు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులతో కలిసి దాడులు చేసి విక్రయదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. వాహనాల్లో తరలిస్తున్న నల్లబెల్లం, పటికలను తనిఖీలు చేసి పట్టుకొని వాహనాలను సీజ్ చేస్తున్నాం.

- శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, దేవరకొండ

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మునిసిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్ తెలి పారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను డిమాండ్ రూ. 25.77 కోట్లు కాగా ప్రస్తుతానికి రూ.5.80 కోట్లు వసూలైనట్లు తెలిపారు. ఆస్తి పన్ను అధిక బకాయిలున్న యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లించని దుకాణాలకు తాళం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్తి, నల్లా పన్ను బకాయిల చెల్లింపులపై తమ రెవెన్యూ విభాగ ఉద్యోగులు వార్డు ఆఫీసర్లతో కలిసి పట్టణంలో పర్యటిస్తు న్నట్లు చెప్పారు.

పట్టణంలో కుక్కల బెడదపై ఫిర్యాదు లంద డంతో స్వతంత్ర్య అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్టెరి లైజేషన్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఆయన వెంట డీఈ వెంకన్న, వెంకటరమణ తదితరులున్నారు.



దుకాణానికి తాళం వేస్తున్న పురపాలక ఉద్యోగులు


ఘనంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి జాతర



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారం గ్రామంలో ప్రతి ఏడాది మాఘమాసంలో నిర్వహించే లక్ష్మీ చెన్న కేశవస్వామి జాతర మం గళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని తేరులో కూర్చొబెట్టి ఊరేగించారు. అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే చెన్నకేశవ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, నాయకులు రమేశ్, తులసిరాం, రమావత్ శ్రీనునాయక్, సత్యం, వడ్త్య బాలు, లాలునాయక్, వెంకటేష్, గ్రామ మైనార్టీ నాయకులు కబీర్‌ఖాన్, లాలునాయక్, శంకరాచారి, పూజారి శివయ్యశర్మ పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీ సంఘం మండల కార్యవర్గాన్ని మండలకేంద్రంలో ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా జెల్లా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గంజి సత్యనారాయణ, కోశాధికారి పున్న విజేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి తిరందాసు కృష్ణయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. మురళి మాట్లాడుతూరాజకీయాలకతీతంగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ, పున్నం వెంకటేశ్వర్లు, వనం జగదీశ్వర్, కర్నాటి రవికుమార్, గడ్డం వెంకటేశ్వర్లు, గండూరి మార్కండేయ్య, పున్న యాదగిరి, గుర్రం శ్రీనివాస్, మస్న మణిదీప్ పాల్గొన్నారు.

చింతపల్లి మండలాధ్యక్షుడిగా గణేష్

చింతపల్లి : పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడిగా వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన కర్నాటి గణేష్‌ను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంఘంలో అంకిత భావంతో ఉండి పద్మశాల సభ్యుల సాధన కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వ్యవస్థలో మార్పు కోసం పోటీ చేస్తున్నా

● ఎమ్మెల్సీ అభ్యర్థి అర్వ స్వాతి

నిడమనూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉపాధ్యాయ సమస్యలు శాసనమండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్రఅభ్యర్థి అర్వ స్వాతీఅశోక్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె విలేక రులతో మాట్లాడారు. గత నాలుగుసార్లు జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళలు పోటీ చేయలేదని, వ్యవస్థలో మార్పు కోసం సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు మహిళలను పట్టించుకోలేదని విమర్శించారు. కాగా స్వాతి వేంపాడ్‌లో గత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు దక్కించుకున్నారు.

ఉపాధ్యాయులు చైతన్యంతో సాగాలి

● ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజన్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అధిక సంఖ్యలో ఓట్లు కలిగిన ఎస్టీ, ఎస్సీ, బీసీ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్ని కల్లో చైతన్యంతో ముందుకు సాగాలని నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్ రాజన్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో పలువురు ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం బీసీ భవన్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఎమ్మెల్సీ నియో జకవర్గంలో 25 వేల 767 ఓట్లు వుండగా అందులో సుమారు 23 వేల ఓట్లు ఎస్సీ, ఎస్టీ బీసీ ఉపాధ్యాయులేనని అన్నారు. సమావేశంలో పంకజ్ యాదవ్, అంబర్ల సత్యనారాయణ, కట్టబోయిన శ్రీనివాస్, మురళీయాదవ్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడ రూరల్ : గూడూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఐలాపురం, తుంగపాడు, జప్తివీరప్పగూడెం, సామ్యగాని తండా, లక్ష్మీపురం, గూడూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న కార్యకర్తలను పార్టీ అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందేలా కృషి చేయాలన్నారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పాములపాడులో 350 మందికి వైద్య పరీక్షలు

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, ఇమ్మానియేల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పాములపాడు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్‌లీడర్ జంగా జయరాజు, జవ్వాజి జెస్సీ కుమార్, జవ్వాజి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను, అద్దాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే పరీ క్షలకు హాజరైన 400 మందికి దుప్పట్లు అందిం చామ న్నారు. కార్యక్రమంలో వైద్యులు చందన, భరత్, భక్తసిగ్, వినీత, సంపత్, సిబ్బంది కుసుమ, స్వామి, సామేలు నరసింహా, రవి, దేవరా పాల్గొన్నారు.



పాములపాడులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హస్తకళలకు ప్రోత్సాహం

దేవరకొండ,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): హస్తకళలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ టీటీడీ కళ్యాణ మండపంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 10 వరకు మినీ సరస్ ఫెయిర్ 2025 ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన బంజారా హ్యాండీక్రాఫ్ట్స్ ప్రదర్శన ఆకట్టుకునే విధంగా ఉండడంతో సోమవారం పీడీ శేఖర్‌రెడ్డి సర్టిఫికెట్ అందజేసి మాట్లాడారు. నాబార్డ్ డీఎం వినయ్‌కుమార్, అధికారులు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీనునాయక్, ఘడీ, లక్ష్మి పాల్గొనారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

సర్వే పేరుతో బీసీలకు కాంగ్రెస్ ద్రోహం

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే పేరుతో బీసీలకు ద్రోహం చేస్తోందని బీసీ సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్య క్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 60శాతమున్న బీసీల సంఖ్యను 45శాతానికి కుదించడం సరికాదన్నారు. రాష్ట్రంలో సర్వే తూతూ మం త్రంగా చేపట్టారన్నారు. అగ్ర కుల ఆధిపత్యాన్ని చెలాయించడం కోసం తప్పుడు చర్యలు చేప డుతున్నారని ఆరోపించారు. రీసర్వే చేయించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు వేముల రామకృష్ణ, కర్నాటి సైదులు, గుంజ ప్రసాద్, శివ, సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సైదులుగౌడ్

కడుపు కోత

(5వ పేజీ తరువాయి)

ఏ రోజులో సుముహూర్తాలు ఉంటున్నాయో పురోహితుల ద్వారా తెలుసుకుంటున్నారు. సుముహూర్తాలు చూసుకొని మరీ ఆపరేషన్ ద్వారా డెలివరీ చేయించుకుంటున్నారు. మంచి ముహూర్తంలో డెలివరీ కావాలని ఆకాంక్షిస్తున్నారు. అందుకోసం ముందుగానే వైద్యులకు సమాచారం ఇచ్చి ఆ సమయంలోనే ఆపరేషన్ ద్వారా ప్రసవం చేయాలని కోరుతున్నారు.

అనారోగ్యానికి గురవుతున్న మహిళలు

గర్భిణులు ఆపరేషన్ల ద్వారా ప్రసవిస్తుండటంతో భవిష్యత్‌లో అనారోగ్యానికి గురవుతున్నారు. సాధారణ ప్రసూతి చేయించుకున్న మహిళలు వీరికంటే ఆరోగ్యవంతులుగా ఉంటున్న సందర్భాలు అధికం. మొదటి కాన్పు ఆపరేషన్ చేయించుకున్న మహిళ రెండో కాన్పులో తప్పనిసరిగా ఆపరేషన్ చేయించుకోవాలి. దీంతో భవిష్యత్‌లో కొంత మంది మహిళలు పలు రకాల వ్యాధులకు గురవుతున్నారు.

కులగణనలో పారదర్శకత లేదు

● మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



హాలియా: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో పారదర్శకత లేదని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు చట్టబద్ధత ఉందని, సమగ్ర కుటుంబ సర్వేకు చట్టబద్ధత లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడడం సరైనది కాదన్నారు. ఈ ప్రభుత్వంలో కుల గణన చేసిన అధికారులే గత బీఆర్ఎస్ పాలనలో సమగ్ర కుటుంబ సర్వే చేశారన్న విషయాన్ని గుత్తా మరిచారన్నారు. రాష్ట్రంలో పదేళ్ల కాలంలో 2 లక్షల మంది జనాభా పెరిగారో చెప్పడంతో ప్రభు త్వం కులగణన ఎంత పారదర్శకత్వం ఇట్టే అర్థమవుతుందన్నారు. 2014లో 51 శాతం ఉన్న బీసీలు 46 శాతానికి ఎలా తగ్గారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాల దృష్టి మళ్లించేందుకే కులగణన నివేదికను బయటికి తీసిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనే రేపటి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు శాపంగా మార నుంద న్నారు. అనంతరం 2025 సంవత్సరం బీఆర్ఎస్ డైరీ క్యాలెండర్‌ను పార్టీ బూత్ కమిటీ సభ్యు లకు అందజేశారు సమావేశంలో జవ్వాజి వెంకటేశ్వర్లు, బొల్లం రవి, జటావత్ రవినాయక్, సతీష్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పరామర్శ

బీఆర్ఎస్ అనుముల మండ లాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు తండ్రి లింగయ్య యాదవ్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందడంతో రామడుగు గ్రామంలో మా జీ ఎమ్మెల్యే భగత్ మంగళవారం సాయంత్రం వెంకటేశ్వర్లును పరామర్శించారు. లింగయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిడిగం నాగయ్య తాటి సత్యపాల్, జటావత్ రవినాయక్, మజ్జిగపు వెంకట్‌రాంరెడ్డి, నల గొండ సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పెద్దవూర, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగూడెం తండా వద్ద వెలసిన సుంకిశాల ముత్యాలమ్మ జాతర గిరిజన సంప్రదాయ పద్ధతులతో వైభవంగా మంగళవారం నిర్వహిం చారు. రెండేళ్లకోసారి నిర్వహించే జాతరకు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతం నుంచి అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి చీరసారెలతో తమ మొక్కులను చెల్లించుకొని బోనాలతో నైవేద్యం చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలు, తండాల నుంచి గిరిజనులు నృత్యాలతో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై ప్రభలు కట్టుకొని తరలి వచ్చిన జన సమూహంతో కిక్కిరిసి పోయింది. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీని నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందుకు తలెత్తకుండా సాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా అమ్మవారికి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అమ్మవారికి పూజలు చేశారు.



ట్రాక్టర్లపై ప్రభలు కట్టుకొని జాతరకు వస్తున్న భక్తులు